RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 233 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 సెప్టెంబర్ 2024 శనివారం పేజీలు : 4

## ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న 45 మంది భారతీయులకు విముక్తి

మాస్కో: దళారుల మాయమాటలకు నమ్మి రష్యా సైన్యంలో చేరిన భారతీయులకు ఊరట లభించింది. ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న వారికి విముక్తి కలిగింది. యుద్ధభూమిలో ఉన్నవారిని రష్యా సైన్యం విడుదల చేసింది. ప్రస్తుతం 45 మంది విడుదలయ్యారు.

మరో 50 మందిని కూడా వెనక్కి రప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని గురువారం విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇటీవల రష్యాలో పర్యటించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయాన్ని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వద్ద ప్రస్తావించడం గమనార్హం. వారిని సైన్యం నుంచి విడుదల చేస్తామని పుతిన్ హామీ ఇచ్చారు కూడా.

# ఇందిరమ్మ ఇంటికి భరోసా

## పీఎంఏవై పథకానికి అనుసంధానం.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఉపశమనం

### పేదల ఇంటికి సాయం పెంచే యోచనలో కేంద్ర సర్కారు?

### పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు.. గ్రామాల్లో రూ.1.30 లక్షలకు?




హైదరాబాద్ : రాష్ట్రంలో పేదల కోసం చేపట్టనున్న 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)కు అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకాన్ని పీఎంఏవైకి అనుసంధానిస్తే అర్హులైన పేదలకు సత్వరమే ఇళ్ల నిర్మాణానికి సాయం అందించగలగడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది. పీఎంఏవై కింద పలు రాష్ట్రాల్లో అమలు చేసే ఇళ్ల నిర్మాణాల పథకాలకు కేంద్రం కొంతమేర నిధులు అందిస్తుంటుంది. ఆ నిధులు అందుకోవాలంటే రాష్ట్రంలో ఎన్ని ఇళ్లను నిర్మించాల్సి ఉందనే అంశంతో పాటు లబ్ధిదారుల వివరాలను తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందించాలి. ఆ వివరాలను పరిశీలించిన తర్వాత కేంద్రం విడతల వారీగా రాష్ట్రాలకు నిధులు అందజేస్తుంది. 2024-25లో పీఎంఏవై కింద దేశవ్యాప్తంగా 3 కోట్ల ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని మోదీ సర్కారు తొలి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయినప్పుడు రాష్ట్రానికి 25 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని, ఆర్థిక సాయాన్ని కూడా పెంచాలని కోరారు. పీఎంఏవై మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాల విధివిధానాలను రూపొందిస్తామని తెలిపారు.

**సర్కారుకు ఉపశమనం..** రాష్ట్రంలో ఇళ్లు లేని అర్హులైన పేదలకు (ఇంటి స్థలం ఉన్న వారికి ఆర్థిక సాయం, జాగా లేని వారికి స్థలమిచ్చి, ఆర్థిక సాయం) ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

దీని ప్రకారం 2024-25లో తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4,16,500 ఇళ్లను పేదలకు అందించాలని, రిజర్వ్ కోటా కింద మరో 33,500 ఇళ్లను ప్రభుత్వ అధీనంలో ఉంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు 22,500కోట్ల నిధులు కావాలని గృహనిర్మాణ సంస్థ అంచనా వేసింది. ఇందిరమ్మ ఇంటిని పీఎంఏవైకి అనుసంధానిస్తే పేదలతో పాటు ప్రభుత్వానికి ఉపశమనం లభించనుంది.

**సాయం పెంచాలని వినతి..** గృహ నిర్మాణ పథకంలో ప్రస్తుతం 2015 నిర్మాణ అంచనాల ప్రకారం కేంద్రం సాయం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిర్మాణ అంచనాలను పెంచాలని కోరింది. 2015 తర్వాత సిమెంటు, స్టీల్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు పెరిగినందున.. ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తే పేదలకు న్యాయం జరుగుతుందని కేంద్రానికి వివరించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారవర్గాల సమాచారం. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.1.60 లక్షలకు పైగా ఇస్తుండగా, దీన్ని రూ.2 లక్షల వరకు.. గ్రామీణంలో రూ.75 వేలకు పైగా ఇస్తున్న సాయాన్ని రూ.1.30 లక్షలకు పెంచాలని కోరినట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యం..** కేంద్రం అందించే పీఎంఏవై సాయాన్ని అందుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణ జాబితాను కేంద్రానికి అందించలేదు. ఫలితంగా 2017-18 తర్వాత పీఎంఏవై నిధులు రాష్ట్రానికి రాలేదు. 2016-17లో రూ.190.79 కోట్లు, 2017-18లో రూ.1120.7 కోట్లు కేంద్రం నుంచి అందాయి. ఆ తర్వాత గత ప్రభుత్వం కేంద్రానికి జాబితా ఇవ్వలేదు.

దాంతో కేంద్రం కూడా నిధులివ్వలేదు. అందుకే గత ప్రభుత్వం చేపట్టిన 'డబుల్ బెడ్ రూం' ఇళ్ల పథకానికి ఆర్థిక సమస్య ఏర్పడిందనే విమర్శలున్నాయి.




హైదరాబాద్: ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తీసుకొస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ వైఖరా? ఆయన వ్యక్తిగతమా? అనే దానిపై భారాస అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చిచ్చుపెట్టొద్దన్నారు. పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ నివాసానికి చేరుకున్న అనంతరం దానం మీడియాతో మాట్లాడారు. గాంధీ నివాసంలో భారాస విస్తృతస్థాయి సమావేశం పేరిట ఆయన్ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డి కెపాసిటీ ఎంతో తమకు తెలుసని ఎద్దేవా చేశారు. తాము అన్నీ చేసే ఇక్కడికి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. "ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. ఇది పార్టీ నిర్ణయమా?కౌశిక్‌రెడ్డి వ్యక్తిగతమా?ఆయన వ్యక్తిగతంగా చేసినట్లు భావిస్తే భారాస నుంచి సస్పెండ్ చేయండి. విస్తృతస్థాయి సమావేశం పార్టీ కార్యాలయంలో చేస్తారా? ఇంట్లో చేస్తారా?అవగాహన ఉండే మాట్లాడుతున్నారా?" అని దానం నాగేందర్ మండిపడ్డారు.




హైదరాబాద్: తెలంగాణలో కొలువుదీరిన రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయాలతో ప్రజల మెప్పు పొందుతోంది. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులకే.. ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత ఒక్కొక్క గ్యారంటీ ప్రారంభించుకుంటూ వస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. పొదుపు సంఘాల మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేయాలనీ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు నిన్న జనగామ జిల్లా పాలకుర్తిలో ఓ మహిళకు ఎలక్ట్రిక్ ఆటోను పంపిణీ చేశారు. పొదుపు సంఘంలో ఉన్న మహిళకు లేదా ఆమె కుటుంబం లో లైసెన్స్ ఉన్న వ్యక్తికి ఈ ఎలక్ట్రిక్ ఆటోను ఇస్తారు. అయితే ప్రభుత్వం స్త్రీనిధి రుణం నుంచి ఈ ఎలక్ట్రిక్ వాహనాన్ని కొనుగోలు చేసి ఇస్తారు. ఈ రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఈ ఆటోలకు ఛార్జింగ్ పాయింట్ల కోసం ప్రభుత్వ అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

# మరో మలుపు తిరిగిన కౌశిక్ - గాంధీ రచ్చ

# రంగంలోకి సీఎం రేవంత్!




హైదరాబాద్ : ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి..గాంధీ సవాళ్ల వ్యవహారం రాజకీయ రచ్చగా మారింది. ఇంకా సవాళ్లు కొనసాగుతున్నాయి. కౌశిక్ ఇంటిపై గాంధీ మద్దతుదారుల దాడితో ఈ అంశం కొత్త టర్న్ తీసుకుంది. బీఆర్ఎస్ నేతలు సీపీ కార్యాలయం వద్ద ధర్నా..అరెస్ట్ తో వివాదం పెరిగింది.

ఆ తరువాత వారిని విడుదల చేసారు. ఈ వ్యవహారం పైన రేవంత్ సీరియస్ అయ్యారు. డీజీపీకి తాజాగా ఆదేశాలు ఇచ్చారు.

**రచ్చ రచ్చ...** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో సవాళ్లు, ప్రతిసవాళ్లకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారంలో కొత్త మలుపు చోటు చేసుకుంది. పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్పీ రవి చందన్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేవారు. 132, 351 (3) బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు నమోదు చేశారు.

**కొనసాగుతున్న ఉద్రిక్తత....** ఈ ఇద్దరి సవాళ్ల మధ్య చోటు చేసుకున్న పరిణామాలకు కొనసాగింపుగా కౌశిక్ రెడ్డి తాజాగా మరో సవాల్ చేసారు. ఇదే సమయంలో శుక్రవారం చలో గాంధీ నివాసానికి బీఆర్ఎస్ పిలుపిచ్చింది. చలో గాంధీ నివాసానికి రావాలని పార్టీ నేతలకు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు పిలుపునిచ్చారు. మల్లంపేటలోని శంభిపూర్ రాజు నివాసం నుంచి భారీ ర్యాలీగా గాంధీ ఇంటికి బీఆర్ఎస్ నేతలు బయలుదేరనున్నారు. ఇప్పటికే కౌశిక్ రెడ్డి అక్కడకు చేరుకున్నారు. దీంతో, పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసారు.

**సీఎం రేవంత్ ఆదేశాలు...** పీఏసీ ఛైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా గాంధీ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపడంతో పాటు ఆయన నివాసంలో మేడ్చల్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు శంబిపూర్ రాజు ప్రకటించారు. ఈ సమావేశానికి హాజరుకావాలని మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులను ఆహ్వానించారు. తాజా పరిణామాల పై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. డీజీపీకి తాజాగా ఆదేశాలు ఇచ్చారు. రాజకీయ కుట్రలు సహించేది లేదని తేల్చి చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీసేలా బీఆర్ఎస్ యత్నం చేస్తుందని మండిపడ్డారు. శాంతి భద్రతల పై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేసారు.

# సంపాదకీయం

## కష్ట కాలంలో కమలం నేతలకు బాధ్యతేదీ?

విజయవాడ వరదల్లో అపార నష్టం వాటిల్లింది. వారం రోజుల పాటు సీఎం చంద్రబాబు, టీడీపీ మంత్రులు ప్రజల మధ్యే ఉన్నారు. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. వారిని ఆదుకునే ప్రయత్నం చేశారు. నిరంతరం సేవలు చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. ఇప్పుడు అసలు ఘట్టం తెరమీదికి వచ్చింది. అదే బాధితులకు ఆర్థిక సాయం చేసే వ్యవహారం. దీనిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ప్రాథమికంగా వచ్చిన నష్టం 6880 కోట్ల రూపాయలు ఉంటుందని సీఎం చంద్రబాబు కేంద్రానికి నివేదిక పంపించారు. దీనిపై ఆయన చాలానే ఆశలు పెట్టుకున్నారు. అయితే.. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు ఈ విషయంలో మౌనంగా ఉండడం ఇప్పుడు చర్చకు దారి తీసింది. ఎందుకంటే.. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు, వీరిలో ఒక కేంద్ర మంత్రి కూడా ఉన్నారు. మరి వీరికి బాధ్యత లేదా? వీరు కనీసం సమస్యలను పట్టించుకునే ప్రయత్నం కూడా చేయలేదు. ఒక్క బీజేపీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి మాత్రం కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వచ్చినప్పుడు ఆయన వెంట ఉన్నారు. అంతకు మించి ఆమె వరద ప్రభావిత ప్రాంతాల్లోనూ పర్యటించలేదు. బాధితులకు భరోసా కూడా కల్పించలేదు. మరి దీనిని ఎలా చూడాలి? అనేది ప్రశ్న. రాజకీయంగా మోడీ ఈ రాష్ట్రానికి ఎన్నో మేళ్లు చేశారని చెబుతున్న బీజేపీ నాయకులు.. కీలకమైన సమయంలో ఎందుకు మౌనంగా ఉన్నారన్నది అందరినీ ఆలోచనకు గురిచేసింది. వాస్తవానికి ఇలాంటి విపత్కర సమయంలో కేంద్రానికి సూచనలు, సలహాలు ఇచ్చి.. బీజేపీ పెద్దలకు ఇక్కడి పరిస్థితిని వివరించాల్సిన అవసరం బీజేపీ నేతలకు ఉందనేది టీడీపీ సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఇన్ని రోజులు అయింది. మేం అడిగాం. అయినా.. కేంద్రం ఏమేరకు స్పందిస్తుందో తెలియదు. బీజేపీ నాయకులకు కొంతైనా బాధ్యత ఉండాలి. కానీ వారికి అలాంటిది లేదనిపిస్తోంది అని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. మరోవైపు.. చంద్రబాబు పంపించిన ప్రాథమిక నివేదికను కేంద్రం ఏమేరకు ఆమోదిస్తుందన్న విషయంపైనా అనేక సందేహాలు వున్నాయి. ఇప్పుడు కనుక కేంద్రం హ్యాండిస్తే.. అది రాజకీయంగా పెనుదుమారానికి, నేతల మధ్య దూరానికి కూడా దారితీసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ రాష్ట్ర నేతలు ఇప్పటికైనా జోక్యం చేసుకుని కేంద్రానికిరాయబారం చేయాల్సిన అవసరం ఉందని పరిశీలకులు చెబుతున్నారు.

## వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహించిన... మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి...

### సాయిరాం యూత్ అసోసియేషన్ వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు మంచినీళ్ళ రాకేష్ ఆకుల శంకర్ తదితరులు...









శామీర్పేట్ (గరుడ వార్త) :గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలియాబాద్ గ్రామంలోని బొడ్రాయి ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీ సాయిరాం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మంటపం వద్ద గత కొంతకాలంగా భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వినాయక మండపం వద్ద సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయిరాం యూత్ అసోసియేషన్ మండపనిర్వాకులైన మంచినీళ్ల రాకేష్, మంచినీళ్ల సందీప్, ఆకుల శంకర్, ఆకుల ప్రదీప్, ఎం మణికంఠ తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ పై బురద చల్లితే ఉపేక్షించం...

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్



శామీర్ పేట, (గరుడ వార్త) : మేడ్చల్ జిల్లా ప్రజలల్లో ప్రాంత విభేదాలు సృష్టిస్తున్న వారిని తరిమి తరిమి కొడతామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రం శామీర్ పేట లోని ఎన్ పి జి కన్వెన్షన్ లో నిర్వహించిన మీడియా సమావేశం లో నక్క ప్రభాకర్ గౌడ్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ప్రభుత్వం పోయేసరికి మతి భ్రమించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిచ్చి పిచ్చిగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. మేడ్చల్ జిల్లా లో ప్రాంతీయ విభేదాలతో రెచ్చ కొడితే బట్ట లుడాదీసి కొడతామని హెచ్చ రించారు. ఎమ్మెల్యే గాంధీ పై నోటికొచ్చినట్లు మాట్లాడితే పుట్టగతులుండవని, త్వరలోనే తగిన గుణపాఠం చెప్తామన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెల్చి చుపియ్యాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక మతిభ్రమించి మాట్లాడు తున్నారన్నారు. ఇప్పటికైనా కౌశిక్ రెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రవర్తించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో శామీర్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, నాయకులు అశోక్, ముజీబ్, యాదగిరి, వెంకటేష్, భాస్కర్ గౌడ్, నర్సిహ్మా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్...




శామీర్ పేట, (గరుడ వార్త) : శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం వాటిల్లకూడదనే లక్ష్యంలో భాగంగా, పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ను గురువారం పోలీసులు అరెస్ట్ చేసినందుకు ఉమ్మడి శామీర్ పేట మండలం లోని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆందోళన చేస్తున్నారని సమాచారం రావడంతో శామీర్ పేట పోలీసులు ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో బీఆర్ఎస్ తలపెట్టిన ఆందోళనకు శామీర్ పేట మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు వెల్లకుండ శామీర్ పేట పోలీసులు వారి వారి ఇళ్ళ వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట సహకార సంఘం చైర్మన్ మధుకర్రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఐలయ్యయాదవ్, నర్సింలుగౌడ్, చాంద్ పాషా, విష్ణువర్ధన్ రెడ్డి, సతీష్ రెడ్డి, బిక్షపతి, శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిందే..

### బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ యాదవ్..

హైదరాబాద్ : బీసీ జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లను పెంచాల్సిందేనని బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో కులగణన చేపట్టి బీసీల లెక్క వాటా తీయాల్సిందేనని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా శుక్రవారం విద్యానగర్ బిసి భవన్ లో బర్కా కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో బర్తడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య ను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పాలకులు మారిన బీసీల స్థితిగతులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా బీసీల చర్చ జరుగుతుందని ఎట్టి పరిస్థితుల్లో రిజర్వేషన్లపై తగ్గేది లేదని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి రిజర్వేషన్లు



పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు కార్యకర్తలు, విద్యార్థి నాయకులు భారీగా పాల్గొన్నారు.

## అభివృద్ధికి లింకు

హైదరాబాద్: దూర ప్రాంతాలను దగ్గర చేస్తూ.. నగరాభివృద్ధిని అన్ని దిక్కులా విస్తరించడమే లక్ష్యంగా చేపట్టిన లింకు రోడ్ల నిర్మాణం విజయవంతంగా సాగుతోంది. ఏడాది కిందటే మొదటి దశ పనులు పూర్తవగా.. ప్రస్తుతం రెండో దశ పనులు కొనసాగుతున్నాయి. నిధుల సమస్యతో పనుల్లో వేగం నెమ్మదించినప్పటికీ పురోగతి కొనసాగుతోంది. తాజాగా జూబ్లీహిల్స్ రోడ్డు నం. 5ను బంజారాహిల్స్ రోడ్డు నం. 2తో కలిపే కీలకమైన రహదారి నిర్మాణం పూర్తి చేసుకుంది. భౌగోళిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఇంజినీర్లు భారీ కొండను తొలగించి ప్రధాన నగరంలో అభివృద్ధి మార్గాన్ని నిర్మించారని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఊపిరి పీల్చుకుంటున్న బస్తీలు : యూసఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ చుట్టుపక్కలున్న వందకుపైగా కాలనీలకు భారీ ఉపశమనం కల్పిస్తూ యూసఫ్‌గూడ చెక్‌పోస్టు రోడ్డు (జూబ్లీహిల్స్ రోడ్డు నం. 5), కేబీఆర్ పార్కు రోడ్డు (బంజారాహిల్స్ రోడ్డు నం. 2)తో అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణమైంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే యూసఫ్‌గూడ, జూబ్లీహిల్స్ రోడ్డు నం. 1, రోడ్డు నం. 5లో రద్దీ తగ్గనుంది. ఇందిరానగర్, జవహర్‌నగర్, కమలాపురికాలనీ, శ్రీనగర్‌కాలనీ ప్రజలు పంజాగుట్ట, క్యాంప్ ఆఫీసు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డు, బంజారాహిల్స్ రోడ్డు నం. 10, 14, 12, 3, 1 రోడ్లను సులువుగా చేరుకోవచ్చు. మరిన్ని పురోగతిలో.. లింకు రోడ్ల అభివృద్ధి మొదటి దశ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రూ. 323 కోట్లతో 25 రోడ్లను 25.2 కి.మీ పొడవున హెచ్‌ఆర్‌డీసీఎల్ అభివృద్ధి చేసింది.

రెండో దశలో భాగంగా రూ. 185.25 కోట్లతో 11 రోడ్లను అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులు తుది దశలో ఉన్నాయి. ఎన్నికలు పూర్తవడంతో ప్రభుత్వం హెచ్‌ఆర్‌డీసీఎల్‌కు ఆర్థిక తోడ్పాటు అందించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

మూసారంబాగ్ అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోల్ మెట్రోస్టేషన్ వరకు రోడ్డును 100 అడుగుల మేర అభివృద్ధి చేస్తూ రూ. 20 కోట్లతో చేపట్టిన లింకు రోడ్డు పనులు తుది దశలో ఉన్నాయి. ల్యాంకోహిల్స్ కూడలి, పుప్పాలగూడ, నార్సింగి, రాజేంద్రనగర్ సన్‌సిటీ, అల్కాపురికాలనీ, నెక్నాంపూర్ ప్రాం తాల్లో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి.

## తీరనున్న వలసదారుల పరేషాన్

హైదరాబాద్ : రాజధానిలో వలసదారుల(మైగ్రేషన్) రేషన్ దరఖాస్తుల వడపోత ప్రక్రియ మొదలైంది. ఉపాధి కోసం వలస వచ్చినవారంతా కొత్తకార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్లు, తదితరాలపై వీరంతా జీహెచ్‌ఎంసీలో 2020లో దరఖాస్తు చేసుకున్నారు. వాటిని తాజాగా పరిశీలించి అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఇంటింటి సర్వే చేయాలంటూ పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో మూడు జిల్లాల అధికారులు పరిశీలన చేపట్టారు. భారీగా అర్హులు..: కొత్త రేషన్ కార్డులపై అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలో కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీపై ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన



రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ చేయకపోవడంతో అర్హుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ మేరకు ప్రజాపాలనలో లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక రేషన్ కార్డుల మ్యుటేషన్లు, కొత్త కార్డుల జారీపై గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో ఆ అంశం పెండింగ్‌లో ఉంది. గ్రేటర్‌లో సుమారు 2లక్షల మంది కొత్త పేర్ల నమోదు, చిరునామాలో మార్పులు, తప్పుడు వివరాల సవరణ తదితరాలపై దరఖాస్తు చేసుకున్నారు. వాటిల్లో 10శాతం తిరస్కరించగా...30శాతం దరఖాస్తుల ప్రక్రియ మాత్రమే పూర్తయ్యింది. 60శాతం పెండింగ్‌లోనే ఉన్నాయి.

## ఎత్తిపోతలపై పట్టింపేదీ?

మల్లాపూర్ : రెండు వేల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న తలంపుతో మల్లాపూర్ మండలం ఒబులాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సోమేశ్వర ఎత్తిపోతల పథకం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని కారణంగా నిరుపయోగంగా మారింది. ఒబులాపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై 1991లో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో నాలుగు సంవత్సరాల పాటు సాగునీటిని అందించారు. అనంతరం విద్యుత్తు బకాయిలు భారీగా పేరుకుపోవడంతో పథకం కాస్తా మరుగున పడింది. ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో నీటిని ఎత్తిపోసే విద్యుత్తు మోటార్లు చెడిపోవడం రైతుల పాలిట శాపంగా మారింది.

మల్లాపూర్ మండలంలోని ఒబులాపూర్, సంగెం, శ్రీరాంపూర్ గ్రామాల్లోని బీడు భూములకు ఎస్సారెస్పీ కాలువల నుంచి సాగునీరు అందని పరిస్థితులు నెలకొనడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఒబులాపూర్ శివారులోని గోదావరిపై అప్పట్లో అధికారులు సోమేశ్వర ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. విద్యుత్తు బిల్లులను చెల్లించకపోవడంతో పథకం మూతపడింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పథకం బిల్లులను ప్రభుత్వం చెల్లించడంతో పాటు మోటార్లు, పరికరాలకు మరమ్మతు చేయించడంతో తిరిగి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. మూడు సంవత్సరాల అనంతరం పథకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మరుగున పడింది. గోదావరికి సమీపంలో ఉన్న రైతులు కొంతమంది నదిలో మోటార్లు ఏర్పాటు చేసుకుని కొంతమేర వ్యవసాయం చేసుకుంటుండగా, నదికి దూరంగా ఉన్న భూములు ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన ప్రభుత్వానికి రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# నాణ్యత ప్రశ్నార్థకం!

పెద్దపల్లి :మానేరు వాగుపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా.. రెండు జిల్లాలను కలిపేలా నిర్మిస్తున్న వంతెన గడ్డర్లు వరుసగా కూలిపోతుండటం విస్మయం కలిగిస్తోంది.. పనులు నాణ్యంగా జరిగాయా.. నిబంధనల ప్రకారం పనులు చేశారా.. అధికారులు సరిగా పర్యవేక్షణ చేశారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి..

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం, ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ 2016 ఆగస్టు 4వ తేదీన రూ.47.40 కోట్ల అంచనాతో కిలోమీటర్ దూరం వంతెన నిర్మాణానికి అప్పటి రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మిస్తున్న క్రమంలోనే భారీ వరదలకు నిర్మాణ సామగ్రి దెబ్బతినడంతో రెండేళ్ల క్రితం గుత్తేదారు పియర్లపై గడ్డర్లను అనుసంధానం చేసే క్రమంలో అవి కూలిపోకుండా ఉండేందుకు చెక్క ముక్కలను పెట్టారు. వాటిని పూర్తి స్థాయిలో బిగించలేదు. మానేరు వాగు రెండేళ్లు భారీ వరదలతో ఉద్ధృతంగా ప్రవహించడంతో సపోర్టుగా ఉన్న చెక్కముక్కలు ధ్వంసమయ్యాయి. దీంతో గిడ్డర్లు పట్టు తప్పాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 22న మూడు గడ్డర్లు కుప్పకూలాయి. అప్పుడు విచారణ జరిపిన అధికారులు చెక్కముక్కల ధ్వంసమవడంతోనే గడ్డర్లు కూలాయని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు రావడంతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేదు. మరోసారి అయిదు గడ్డర్లు నేలకూలాయి. రెండు సందర్భాల్లోనూ గాలి దుమారం బాగా వచ్చినప్పుడే కుప్పకూలాయని ఓడేడు గ్రామస్థులు పేర్కొంటుండగా గాలి దుమారానికి గడ్డర్లు కుప్పకూలే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. వాస్తవానికి కాంక్రీట్ గడ్డర్లు చాలా బరువు కలిగి ఉంటాయి. వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇవి బలోపేతంగా ఉంటేనే సాధ్యమవుతుంది. అలాంటి గడ్డర్లు పేకమేడల్లా కూలిపోవడం గమనార్హం. డిజైనింగ్ సరిగా ఉందా.. నిర్మాణానికి ముందు భూమి



పరీక్ష చేశారా.. పనులు చేసే సమయంలో పర్యవేక్షణ సరిగా ఉందా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

కాంక్రీట్ బీమ్ సరిగా లేకే..ఒక్కో గడ్డరు 130 టన్నుల బరువుతో ఉంటుంది. కిలోమీటర్ వంతెన నిర్మాణానికి 120 గడ్డర్లు అవసరమయ్యాయి. ఇందులో 58 వంతెనకు అనుసంధానించగా మిగిలిన 62 ఇంకా బిగించలేదు. ఏప్రిల్ 22, జులై 2న కూలిన గడ్డర్లు మొదటగా అనుసంధానించిన 58 గడ్డర్లలోనివి. కాంక్రీట్ బీమ్‌లు సరిగా వేయకపోవడంతోనే కూలిపోయి ఉండవచ్చని భావిస్తున్నాం. మిగతా గడ్డర్లు కూడా నిర్మించిన వెంటనే అనుసంధించకుండా వదిలేశారు. ఇవి కూడా కూలిపోవడానికి అవకాశం ఉంటుంది. గతంలో కూలిన గడ్డర్లకు గ్యాస్ వెల్డింగ్ వేసి వంతెనకు అనుసంధానించేందుకు ప్రయత్నించినా నిలవడం లేదు. ఈ పనులు చేసిన గుత్తేదారు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఆయన నుంచి జరిగిన నష్టం వసూలు చేస్తాం. మిగిలిన పనులు వేరే గుత్తేదారుకు అప్పగించి పనులు పూర్తి చేస్తాం. వంతెన పనులు పూర్తి స్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. జాఫర్, డీఈ, ఆర్అండ్‌బీ

## ఉపకార వేతనాల సాధనలో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి :పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే విద్యను ఆపేయకుండా ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన అర్హత పరీక్ష(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులు దీనికి అర్హులు.. ఈ పరీక్షలో రాణించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందజేస్తోంది. ఉమ్మడి జిల్లాలోనే రామగుండం లింగాపూర్‌లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం అత్యుత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయులు ఎన్ఎంఎంఎస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ఉపకార వేతనం సాధించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

అర్హతలు... పరీక్ష విధానం

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించే ఉపకారవేతన పరీక్షకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.. వీరు ఏడో తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50, ఇతరులు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీనిని ఏటా నవంబరు మాసంలో నిర్వహిస్తారు. జిల్లా యూనిట్గా, కేటగిరీల వారీగా, ప్రతిభ కొలమానంగా అర్హులను ఎంపిక చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఏటా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఈ అర్హత పరీక్ష రాసేలా ప్రోత్సహిస్తున్నారు.

ఆదర్శ పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులు

2022-2023 : 19

2021-2022 : 23

2023-2024 : 17

ఎంతో సంతోషంగా ఉంది

నేను రామగుండం మోడల్ పాఠశాలలో ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్ష రాసి అత్యుత్తమ మార్కులు సాధించా. సీనియర్ల సలహాలు, సూచనలతో నిత్యం చదువుపై దృష్టి సారించా. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో నమూనా ప్రశ్నపత్రాలతో నిత్యం సాధన చేశా. నా కష్టానికి ఫలితం దక్కింది. ఉపకార వేతనం పొందేందుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

చిట్టోజు అన్విత, తొమ్మిదో తరగతి

ఉపాధ్యాయుల శిక్షణ బాగుంది

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించా. ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ ఇందుకు ఎంతగానో దోహదపడింది. ఉపాధ్యాయుల చొరవతో ఆన్‌లైన్ తరగతుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించా. అనుకున్న విధంగా మంచి ర్యాంకు సాధించి ఉపకార వేతనానికి ఎంపికయ్యా. పాఠశాలలో ప్రత్యక్ష బోధనతో పాటు అంతర్జాలంలో కూడా ప్రతి అంశాన్ని వివరించారు.

ఎం.చక్రిక, తొమ్మిదో తరగతి

సమష్టి కృషితో...

ఈ విద్యా సంవత్సరం రామగుండం మోడల్ పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను రీజనింగ్, నెంబరు సిరీస్ ఇతర అంశాలపై నిత్యం సన్నద్ధం చేయించాము. సాంఘిక, సామాన్య, గణితంపై ఇతర ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చాము. ప్రతి ఏటా విద్యార్థులు అధిక సంఖ్యలో ఉపకార వేతనాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ముత్యం రాజశేఖర్, ఆంగ్ల ఉపాధ్యాయులు

# ఆలయ రహదారి విస్తరణకు అడుగులు



వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోనుంది. రహదారి విస్తరణలో నష్టపోయే ఇళ్లకు సంబంధించి భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రోడ్డు విస్తరణకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఇది జరిగితే పట్టణ ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరనుంది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వీరితోపాటు స్థానికులతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. పలు సందర్భాల్లో ఈ రహదారి పద్మవ్యూహాన్ని తలపిస్తుంటుంది. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడటం సర్వసాధారణమైంది. ఈ రహదారిని ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ వంతెన వరకు విస్తరించాలన్న ప్రతిపాదనలు గత కొన్నేళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు. గత ఏడాది రెవెన్యూ, ఆర్అండ్‌బీ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ), సర్వే అధికారులు సర్వే చేసి అంచనాలు రూపొందించారు.

గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణకు రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా నిధులు విడుదల కాక పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టడంతో ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. తిరిగి సర్వే నిర్వహించి విస్తరణ పనులు చేపట్టనున్నారు. దీంతో ఈసారి రహదారి విస్తరణకు మోక్షం లభించనుందని భావిస్తున్నారు.

నష్టం ఏర్పడే ఇళ్ల సంఖ్య 243

రహదారి విస్తరణతో ఆలయం ముందు నుంచి మూలవాగు వంతెన వరకు దాదాపు 243 ఇళ్లకు నష్టం ఏర్పడనున్నదని అధికారులు అంచనా వేశారు. 80 అడుగుల వరకు విస్తరించనున్నారు. బాధితులకు పరిహారం కింద దాదాపు రూ.47 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. రెండు నెలల్లో సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఇవీ ఇబ్బందులు

రాజన్న దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండటంతో వాహనాలు కూడా దాదాపు వేయి వరకు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వీరితో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం పట్టణానికి వస్తుంటారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది.

అత్యవసర పరిస్థితుల్లో ఈ ప్రాంతంలోని వారు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. కొన్ని సందర్భాల్లో కనీసం పాదచారులు కూడా వెళ్లలేనంత రద్దీ ఉంటుంది.

రాజన్న ఆలయంలో జరిగే వివిధ ఉత్సవాల సమయంలో జన సంద్రంగా మారుతుంది. ఇలాంటి సందర్భంలో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. రహదారి విస్తరణతో ఈ ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

రెండు నెలల్లో సర్వే పూర్తి - రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ

రాజన్న ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ వంతెన వరకు రహదారి విస్తరణకు భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు నెలల్లో రహదారి విస్తరణలో కోల్పోయే ఇళ్లను సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నాం. నివేదిక ఆధారంగా ప్రభుత్వం రహదారి విస్తరణ పనులకు చర్యలు చేపట్టనున్నది.

# అమ్మలేం.. నడపలేం



సిరిసిల్ల : జిల్లా వస్త్ర పరిశ్రమకు విద్యుత్తు బిల్లులు గుదిబండగా మారాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని వస్త్ర పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు విద్యుత్తు యూనిట్లకు రాయితీ, బిల్లుల్లో తగ్గింపులు ఇస్తున్నాయి. జిల్లాలో మాత్రం కుటీర పరిశ్రమగా ఉన్న మరమగ్గాలకు నాలుగో కేటగిరీలో యాభై శాతం రాయితీ ఉంది. మిగతా ఎస్ఎస్ఐ యూనిట్లకు, టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు మాత్రం ఎలాంటి రాయితీ లేదు. గత ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్కుకు పలు విడతల్లో విద్యుత్తు రీయింబర్స్‌మెంటును విడుదల చేసింది. సిరిసిల్లలోని ఎస్ఎస్ఐ యూనిట్లకు ఇప్పటికీ రూ.20 కోట్లపైన బకాయిలు ఉన్నాయి. ఈ బిల్లులు చెల్లించలేక మూసివేశారు. మరికొంత మంది సందిగ్ధంలో ఉన్నారు. జిల్లా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్తు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఈఆర్‌సీకి లేఖ రాశారు. ఇక ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం నేతన్నలు ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో మరమగ్గాల వస్త్రోత్పత్తితో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. కుటీర పరిశ్రమలుగా ఉన్న వాటికి మాత్రమే ప్రభుత్వం యాభై శాతం రాయితీ వర్తిస్తుంది. అది కూడా పది హెచ్‌పీల వరకే పరిమితి.

జిల్లాలో 2018 తర్వాత మరమగ్గాల సంఖ్య పెరిగింది. వీటిలో ఎక్కువగా ఎస్ఎస్ఐ యూనిట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం పది హెచ్‌పీ నుంచి ఇరవై హెచ్‌పీలకు పెరిగింది. ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నవారు ప్రభుత్వ ఆర్డర్లకు చేనేత, జౌళిశాఖకు ఎస్ఎస్ఐ యూనిట్లుగా పేర్కొన్నారు. దీంతో వీరి విద్యుత్తు వినియోగం, ప్రభుత్వ రాయితీలపై సెస్ విచారణ చేసింది. ఎస్ఎస్ఐ యూనిట్లకు ప్రభుత్వ రాయితీ వర్తించదని చేనేత, జౌళిశాఖ తేల్చి చెప్పింది. దీంతో ఈ ఎస్ఎస్ఐ యూనిట్లన్నీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని మూతపడ్డాయి.

తమిళనాడులోని మరమగ్గాలకు ఉచిత విద్యుత్తును 750 నుంచి వెయ్యి యూనిట్లకు అక్కడి ప్రభుత్వం పెంచింది. 1,500 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.4.15, ఆపైన అయితే రూ.5.30 చేశారు. కర్ణాటకలో పది హెచ్‌పీల నుంచి 20 హెచ్‌పీలకు సామర్థ్యం పెంచారు. దీనిలో యూనిట్‌కు పరిశ్రమ వర్గాలు రూ.1.25 చెల్లించాలి. మహారాష్ట్రలో మరమగ్గాలకు యూనిట్‌కు రూ.2 చొప్పున చెల్లించాలి.

ప్రభుత్వం ప్రతిసారి రీయింబర్స్‌మెంటు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. పెరుగుతున్న విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు మరో ప్రత్యామ్నాయం సౌర విద్యుత్తు వాడకం. టెక్స్‌టైల్ పార్కులోని 112 యూనిట్లలో ఏడు యూనిట్లు సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకున్నాయి. ఒక్కో పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి 50-75 కిలోవాట్లతో యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. 75 కిలోవాట్లు సామర్థ్యం ఉన్న యూనిట్కు రోజుకు 300 కిలోవాట్ల విద్యుత్పత్తి అవుతుంది. సగటున 50 కిలోవాట్ల సామర్థ్యానికి రూ.17-20 లక్షల వరకు ఖర్చువుతుంది. తర్వాత వీటి ఏర్పాటు ఖర్చులు పెరగడంతో యజమానులు వెనక్కి తగ్గారు.

రాయితీ కల్పించాలి- చిలుక అనిల్, ఆసామి

# షెడ్డు దాటని వాహనం.. పారిశుద్ధ్యం అధ్వానం

తాండూరు : తాండూరు పురపాలక సంఘంలో పారిశుద్ధ్యం, ఇతర పనుల కోసం ఉపయోగించే వాహనాలు ఏళ్లుగా మెకానిక్ షెడ్డు దాటడంలేదు. వాటికి మరమ్మతు చేసినా డబ్బులు చెల్లించలేదని మెకానిక్‌లు ఇచ్చేందుకు అంగీకరించడంలేదు. మొత్తం 15 ఆటోలు, ఒక ట్రాక్టరు, మరొక జేసీబీ షెడ్లలోనే ఉండి పోయాయి. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా సాగక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రూ.1.30 కోట్లతో 18 ఆటోల కొనుగోలు

గత 2021లో అప్పటి అధికారులు రూ.1.30 కోట్ల పట్టణ ప్రగతి నిధులతో 18 ఆటోలను కొనుగోలు చేశారు. ఏడాది పాటు బాగానే ఉపయోగించారు. తర్వాత నిర్వహణ గాడి తప్పి పాడై పోయాయి. వీటిని మరమ్మతు చేయటానికి పట్టణంలోని ముగ్గురు మెకానిక్‌లకు విడతల వారీగా ఇచ్చారు. మరమ్మతులు చేసినా డబ్బులు చెల్లించలేదు. దీంతో ఆటోలను వారు తిరిగి ఇవ్వలేదు. మొత్తం 15 ఆటోలు మూడు మెకానిక్ షెడ్ల వద్ద ఉన్నాయి. వాటిలో ఒక ట్రాక్టరూ ఉంది. మరో జేసీబీ హైదరాబాద్‌లో ఉంది. వీటిని ఎవరూ పట్టించుకోక పోవడంతో వాహనాలలోని కొన్ని విడి భాగాలు మాయమైపోయాయి.

పట్టణ వ్యాప్తంగా 14 మురికివాడలు: వాహనాలు లేక పోవడంతో పారిశుద్ధ్యంపై తీవ్ర ప్రభావం పడింది. పట్టణ వీధుల్లో చెత్త కుప్పలు పూర్తి స్థాయిలో తొలగటం లేదు. పట్టణ వ్యాప్తంగా 36 వార్డుల్లో 71వేల మంది జనాభాకు 14 గుర్తించిన మురికి వాడలున్నాయి. ప్రతి రోజు 42 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త వెలువడుతోంది. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించటానికి వాహనాలు పూర్తి స్థాయిలో లేక పోవటంతో తొలగించటానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి.



పట్టణ వ్యాప్తంగా వీధుల్లో చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. మురుగు కాల్వలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలక వర్గం స్పందించి మెకానిక్ షెడ్లలో ఉన్న వాహనాలను ఉపయోగంలోకి తీసుకు వచ్చి పారిశుద్ధ్య నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అన్ని వాహనాలను వెంటనే తిరిగి పురపాలక సంఘం కార్యాలయానికి తీసుకు రావాలని అధ్యక్షురాలు స్వప్న అధికారులకు సూచించారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

దస్త్రాలు తనిఖీ చేసి డబ్బు చెల్లిస్తాం

వాహనాల మరమ్మతులకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలి ఉంది. దస్త్రాలు తనిఖీ చేసి మెకానిక్‌లకు డబ్బులు చెల్లిస్తాం. వాహనాలను తిరిగి తీసుకు వచ్చి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం - మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి.

# పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత

కరీంనగర్ : ప్రస్తుతం పల్లెలతోపాటు పట్టణాల్లోనూ జ్వరాల తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానాలు, పట్టణ కేంద్రాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి వైద్యులను నియమించింది. రెండేళ్లపాటు స్థానికంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందగా ఇటీవల ఉన్నత చదువుల కోసం కొందరు, ఇతర కారణాలతో కొందరు వైద్యులు విధులకు స్వస్తి పలకడంతో ఆయా దవాఖానాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు మెరుగైన వైద్యం అందక.. పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం తీసుకోలేక అనారోగ్యంతో మంచం పడుతున్నారు.

ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు దూలం రాజమ్మ. బూర్గుపల్లికి చెందిన ఈమెకు జ్వరం రాగా స్థానికంగా ఉన్న పల్లె దవాఖానాకు వెళ్లింది. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వైద్యుడిని ఆశ్రయించి వైద్యం పొందారు. ఇందుకు ఆర్థికంగా భారమైంది. ఇక్కడి వైద్యుడు నాలుగు నెలలుగా లేకపోగా ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. రెండో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు.

ఖాళీలు ఇవీ.. జిల్లాలో పల్లె దవాఖానాలు 97 ఉండగా 12 చోట్ల వైద్యుల్లేరు. అత్యధికంగా గంగాధర మండలం ఉప్పరమల్యాల, గర్శకుర్తి, గట్టుబూత్కూర్, బూర్గుపల్లి గ్రామాల్లో వైద్యుల్లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని నాలుగు బస్తీ దవాఖానాల్లో వైద్యులు ఉన్నారు. 6 అర్బన్ ఆరోగ్య కేంద్రాలకుగాను హౌసింగ్‌బోర్డు కాలనీ, మోత్రజ్‌ఖానాలో వైద్యుల్లేరు. జిల్లాలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకుగాను ప్రధానంగా మానకొండూరు, చిగురుమామిడి, శంకరపట్నం, చల్లూరు ఆరోగ్య కేంద్రాలకు వైద్యుల్లేక ఆయా మండ



లాల ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరితోపాటు ఆసుపత్రుల్లో ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ అసిస్టెంట్, ఆరోగ్య సూపర్‌వైజర్ల నియామకం జరగక వైద్యసేవలు అందడంలేదు. మధుమేహం, రక్తపోటు మందులు అందుబాటులో ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 104 వాహనం వచ్చిన సమయంలో మాత్రమే మందులు ఇవ్వగా కొన్నేళ్లుగా వాహనం ఊళ్లోకి రావడం లేదని, మందులు ఇచ్చేవారే లేరని వ్యాధిగ్రస్తులు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి

పల్లె దవాఖానాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో నియామకాలు త్వరలోనే చేపడతాం. ఖాళీలు ఉన్నచోట పక్క ప్రాంతాల వైద్యులకు అదనపు బాధ్యతలు అప్పగించి సేవలందిస్తున్నాం. వైద్యసేవల పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నాం.

# ఉబికి వస్తున్న కన్నీళ్లు

గంగాధర: వారి ఇళ్లలో నీరు ఉబికి వస్తోంది. గోడలు తడిసి నిత్యావసరాలు పాడవుతున్నాయి. ఇంట్లోంచి నీటిని బయటకు ఎత్తిపోస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే దుస్థితి అని నారాయణపూర్, గంగాధర జలాశయాల ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉండటంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలంలో అయితే ముంపు గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. తమ ఊళ్లను స్వాధీనం చేసుకుని పునరావాసం కల్పించాలని వేడుకుంటున్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి నారాయణపూర్ గ్రామాన్ని సందర్శించి ముంపు బాధితులకు భరోసా కల్పించారు. కానీ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు.

పరిహారానికి నిరీక్షణే.. జలాశయం నిర్మాణంలో కోల్పోయిన 236 ఎకరాల వ్యవసాయ భూములతోపాటు బావులు, పైపులైన్లకు నష్టపరిహారం చెల్లించాలి. పదేళ్ల కిందటే రూ.10 లక్షల చొప్పున ప్రకటించినా ఇంతవరకు మంజూరు కాలేదు. మంగపేటలో 11 ఇళ్లు, నారాయణపూర్ చెరువు కట్ట కింద 31 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని గతంలో అధికారులు గుర్తించారు. నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు ఒక్క పైసా కూడా బాధితులకు చెల్లించలేదు. చర్లపల్లి-ఎన్, ఇస్తారుపల్లి గ్రామాల్లోనూ ముంపు సమస్యలతో ప్రజలు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోటెత్తిన వరద.. ఇళ్లలో ఊట జిల్లాలోని గంగాధర, నారాయణపూర్ జలాశయాలను ఎల్లంపల్లి నీటితో నింపి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీటిని అందిస్తున్నారు. అయితే 0.3 టీఎంసీల సామర్థ్యం గల ఈ చెరువుల కట్టలను అభివృద్ధి చేయకుండా ఏళ్లుగా నీటిని నింపుతుండటం సమస్యగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారాయణపూర్ చెరువు నిండుకుండలా మారింది. ఇళ్లలో నీటి ఊటలు వస్తుండగా గోడలు తడిసిపోతున్నాయి. రెండేళ్ల కిందట నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు గండ్లు పెట్టగా వరద ఉద్ధృతితో భయానక పరిస్థితి నెలకొంది. నారాయణపూర్ చెరువు కట్ట వెడల్పు, ఎత్తు పెంచకుండా.. కేవలం చెరువు మత్తడి వద్ద లక్షలాది రూపాయలతో ఎత్తు పెంచడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి కట్టకు సమాంతరంగా వరద చేరింది. ఏ క్షణంలోనైనా కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో ముంపు బాధితులు భయాందోళన చెందుతున్నారు.

వస్తువులన్నీ తడిసిపోతున్నాయి - మ్యాకల లక్ష్మి, నారాయణపూర్

చెరువు కట్ట కింద ఉన్న మా ఇంట్లో నీటి ఊటతో వస్తువులన్నీ తడిసిముద్దవుతున్నాయి. పాములు, తేళ్లు వస్తున్నాయి. ఇంట్లోకి నీరు జాలువారి గోడలు పదునెక్కుతున్నాయి. చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాం.

చెరువు కట్ట నుంచి నీటిజాలు- మర్రి పరశురాములు, నారాయణపూర్

చెరువు కట్ట నుంచి ఇంట్లోకి నీటిజల వస్తుంది. గోడలన్నీ తడిసిపోతుండగా ఇంట్లో నీటిని ఎత్తిపోసుకుంటున్నాం. వేసవిలోనూ నీటిని నింపడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. తమ ఇళ్లను స్వాధీనం చేసుకొని పునరావాసం కల్పించాలి. వర్షాలు కురిసినప్పుడే అధికారులు వచ్చి వెళ్తారు. తర్వాత మరచిపోతారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం - మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే నారాయణపూర్, మంగపేట గ్రామాల్లో సర్వే చేసి ముంపునకు గురవుతున్న ఇళ్లకు పరిహారం చెల్లిస్తాం. ప్రత్యేక ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్లు నిర్మించి ఇస్తాం.

# కరకట్ట నిర్మాణం సాకారమయ్యేనా ?

ధర్మపురి : ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన ధర్మపురి పట్టణానికి ఏటా గోదావరినది వరద తాకిడితో ముప్పు పొంచి ఉంటోంది. కడెం ప్రాజెక్టు నుంచి నీటిని వదిలిన వెంటనే ధర్మపురి ప్రాంతానికి పెద్ద ఎత్తున వరదపోటెత్తుతోంది. వరద నీటి ప్రవాహంతో ఇబ్బందులు లేకుండా ఉండాలంటే కరకట్ట నిర్మాణంతోనే సాధ్యం.

**రూ.4 కోట్లతో ప్రతిపాదన**

గత ఏడాది జులైలో గోదావరినది ఉగ్ర రూపం దాల్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వరద బాధితులకు కట్టుబట్టలే మిగిలాయి. కరకట్ట నిర్మాణంతోనే ధర్మపురిలో వరద నష్టాన్ని శాశ్వతంగా నివారించినట్లవుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు పురపాలకసంఘం అవసరమైన నిధులను ప్రతిపాదనల్లో గత ఏడాది చేర్చింది. ధర్మపురిలో శాశ్వతంగా వరద నివారణ కోసం కరకట్ట నిర్మాణానికి సర్వేలు చేసి రూ.4 కోట్లతో ప్రతిపాదించారు. వరద వల్ల ముంపు వాటిల్లే ప్రదేశాలను పదింటిని గుర్తించారు. వాటిలో తెనుగువాడ, కుమ్మరివాడ, బ్రాహ్మణసంఘం, తెలుగు కళాశాల, రామాలయం, మంగళిగడ్డ, బోయవాడ, ఒడ్డెర



కాలనీ, విద్యుత్తు సబ్‌స్టేషన్, బ్రాహ్మణవాడ, వైశ్యసత్రాలను గుర్తించారు. రెండు లక్షల క్యూసెక్కులకు పైగా నదిలో వరద ఉంటే ధర్మపురికి ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో ముంపు ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరద వచ్చే ప్రదేశాలను ముందస్తుగా ఎలా గుర్తించాలి? తదితర అంశాలపై చర్చించారు. హన్మాండ్ల గడ్డ నుంచి కిందఉన్న మహాలక్ష్మీఘాట్ వరకు 2 కిలోమీటర్లకు పైగా నిర్మాణం చేయాలంటే కనీసం రూ.4 కోట్ల వ్యయం అవుతుందని ప్రతిపాదించారు. నిధులు మంజూరైతే ఈ నిర్మాణం చేపట్టే అవకాశముంది. ఈ విషయమై పుర కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతూ...వరద ముంపు తప్పించేందుకు కరకట్ట నిర్మాణం చేయాలని ప్రతిపాదించామన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నిర్మాణం చేపట్టాలని.. నిధులు మంజూరవగానే ప్రారంభించే అవకాశముందని తెలిపారు.

# ఆహారశుద్ధి పరిశ్రమలవైపు అడుగులేవీ!

పెద్దపల్లి : పరిశ్రమల స్థాపనతో కొత్త జిల్లాల్లో అభివృద్ధిని పరుగు పెట్టించాలని గత ప్రభుత్వం చేపట్టిన ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. ఆశించిన మేర ఔత్సాహికులు ఆసక్తి చూపకపోవడం, స్థానికుల నుంచి వ్యతిరేకతతో ఉమ్మడి జిల్లాలో కొత్త పరిశ్రమలేవీ అందుబాటులోకి రాలేదు. ఆహారశుద్ధి పరిశ్రమలతో వ్యవసాయ ఉత్పత్తులకు స్థానికంగానే గిట్టుబాటు ధర లభిస్తుందని భావించినప్పటికీ టీఎస్ ఐపాస్‌లో నిబంధనలు కఠినతరంగా ఉండటం, పరిశ్రమలకు స్థలాలు కేటాయించడంపై వ్యతిరేకత రావడం పారిశ్రామికీకరణ ప్రక్రియకు అవరోధంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం 1500 ఎకరాల భూమిని గుర్తించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ దిశగా ముందడుగు పడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎందుకు ఈ పరిస్థితి!** ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కరీంనగర్ జిల్లాలో ఒబులాపూర్, సిరిసిల్లలో నర్మాల, జగిత్యాలలో స్తంభంపల్లి, మెట్లచిత్తాపూర్, పెద్దపల్లి జిల్లాలో ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించారు. అతి తక్కువగా ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో 110 ఎకరాలు, అత్యధికంగా చిగురుమామిడి మండలం ఒబులాపూర్‌లో 500 ఎకరాల స్థలాన్ని అధికారులు గుర్తించారు. గంభీరావుపేట మండలం నర్మాలలో చిరుతిళ్ల పరిశ్రమ కోసం భవనం పూర్తయినా ఉత్పత్తి ప్రారంభం కాలేదు.
స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు.
పలువురు ఔత్సాహికులు ఆసక్తి కనబరిచినప్పటికీ మార్కెటింగ్ సమస్యతో వెనుకడుగు వేసినట్లు ప్రచారం జరుగుతోంది.
ఆహారశుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం.. అక్కడి కంటే అత్యుత్తమ మార్కెట్ ఏర్పాటు చేసుకునే సామర్థ్యం స్థానికంగా లేకపోవడంతో పరిశ్రమలు ఏర్పాటుకు నోచుకోలేదు.

**అనుబంధానికి ఊతమివ్వాలి**

ఉమ్మడి జిల్లాలో 500కు పైగా బియ్యం మిల్లులున్నాయి. వీటిలో వాణిజ్య తరహా ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం అందించాలి. బియ్యం తయారు చేసే మిల్లుల్లోనే ఇడ్లీ రవ్వ, బియ్యం రవ్వతో పాటు బియ్యం ఆధారిత ఇతర ఉత్పత్తుల తయారీకి ఊతం అందించాలి. జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచి మార్కెటింగ్ వసతి కల్పించాలి. మామిడి పల్ప్ తయారీని ప్రోత్సహించి విక్రయ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలి. సింగరేణి సంస్థతో పాటు జిల్లాలోని బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమలకు అవసరమైన ఉత్పాదక సామగ్రిని తయారు చేసే అనుబంధ పరిశ్రమలకు ఊతమివ్వాలి.

**రెండు చోట్ల వ్యతిరేకత**

చిగురుమామిడి మండలం ఒబులాపూర్‌లో ఆహారశుద్ధి పరిశ్రమ స్థాపనను గ్రామస్థులు వ్యతిరేకించారు. తోటపల్లి జలాశయ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలంలో ఆహారశుద్ధి కేంద్రం ఏర్పాటుతో కలిగే ప్రయోజనం కంటే సాగునీటి ప్రాజెక్టుతోనే తమకు మేలు జరుగుతుందని రైతులు స్పష్టం చేశారు. ఈ విషయమై కొందరు కోర్టుకు కూడా వెళ్లడంతో పరిశ్రమ ఏర్పాటు అటకెక్కింది. వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలోనూ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును రైతులు వ్యతిరేకించారు. ఆ పరిశ్రమతో వాయు, జల కాలుష్యం పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఉద్యమించడంతో నిర్మాణం అటకెక్కింది.

**స్థానిక అవసరాలే ప్రామాణికం** కొత్త పారిశ్రామిక విధానంపై కసరత్తు చేస్తున్నాం. త్వరలో ప్రకటించి కార్యాచరణ చేపడతాం. స్థానిక అవసరాలే ప్రామాణికంగా పరిశ్రమ లను ఏర్పాటు చేస్తాం. భారీ పరిశ్రమలకు ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సింగరేణి అనుబంధ పరిశ్రమలను కూడా పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు యత్నిస్తాం. స్థానికంగా పండించే వరి, మిర్చి, పత్తి ఆధారిత పరిశ్రమల కోసం పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలను ప్రోత్సహిస్తాం. – డి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

# ఇంటింటికీ భగీరథ.. ఇంకా దూరమే



పరిగి : 'మిషన్ భగీరథ' పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో అమలు తీరు తెన్నులను నిశితంగా పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా జూన్ 1 నుంచి జులై 17 వరకు గ్రామ కార్యదర్శులతో జిల్లా వ్యాప్తంగా సర్వే చేపట్టింది. వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన పథకంలో అక్రమాలు జరిగాయన్న వాస్తవాలతోపాటు, నిర్వహణ, పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని సర్వేలో వెల్లడైంది. దీనికి సంబంధించి కథనం.

**శ్రీశైలం రిజర్వాయిర్ బ్యాక్ వాటర్**

మిషన్ భగీరథ పథకం 2018లో ప్రారంభమైంది. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌ను 231 కిలోమీటర్ల దూరం నుంచి పరిగి మండలం రాఘవాపూర్ శివారు వరకు తీసుకువచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ప్లాంటులో రోజుకు 1.35కోట్ల మిలియన్ లీటర్ల నీరు శుద్ధి జరుగుతోంది. జిల్లాలోని నాలుగు పురపాలికలైన వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌తో పాటు 980 ఆవాస గ్రామాల పరిధిలో ప్రతిరోజూ సరఫరా చేస్తున్నారు.

**10 శాతం నల్లాలు లేవు**

నీరు సక్రమంగా అందుతుందా, ఇంటింటికీ బిగించిన నల్లాలున్నాయా లేవా అని సర్వే చేశారు. ట్యాంకుల వద్ద పరిశుభ్రత ఏ విధంగా ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో ట్యాంకుల నుంచి నీటిని ఏ విధంగా వదులుతున్నారు తదితర విషయాలపై కూడా ఆరా తీశారు.
జిల్లాలో 2016 నుంచి 980 ఆవాస ప్రాంతాల్లో 2.07 లక్షల నల్లాలను బిగించారు. వీటిలో 10 శాతం నల్లాలు లేవని సర్వే నివేదికలు తెలుపుతున్నాయి. సుమారు 21,000 నల్లాలు లేవని గుర్తించారు. ఈ సర్వేలో కేవలం గృహాలనే తీసుకున్నారు. బడులు, ప్రార్థనా స్థలాలను మినహాయించారు. పురపాలికల్లో సర్వే నిర్వహించలేదు. బషీరాబాద్ గ్రామంలో 2991 నల్లాలు బిగిస్తే వీటిలో 297 లేవని తేలింది. జిల్లాలో పాత కొత్తవి కలిపి 1460 ట్యాంకులున్నాయి. 2 వేల కి.మీ. పొడవునా పైపులైన్ వేశారు.
భగీరథ కనెక్షన్ల లెక్క.. పంపిణీ లెక్కలకు సరిపోవడం లేదు. అవసరం ఉన్నా లేకపోయినా ఇష్టారాజ్యంగా కనెక్షన్లు ఇవ్వడంతో ప్రజాధనం వృథాగా మారింది. ఖాళీ ప్లాట్ల ప్రదేశాల్లోనూ కనెక్షన్ల కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. పట్టణాల్లోని కాలనీల్లో భగీరథ పైపులు ఎక్కడ పడితే అక్కడ ఇళ్లముందు వృథాగా దర్శనమిస్తున్నాయి.
పథకం ప్రారంభం.. 2018
రోజుకు నీటిశుద్ధి.. 1.35 కోట్లమిలియన్ లీటర్లు
భూ ఉపరితల ట్యాంకులు.. 806
ఒక్కొక్కరికి పంపిణీ.. 100 లీటర్లు
ఉమ్మడి రంగారెడ్డి కింద వ్యయం.. రూ.1,800 కోట్లు
ట్యాంకుల శుభ్రతకు అధిక ప్రాధాన్యంబాబుశ్రీనివాస్, ఈఈ, జిల్లా గ్రామీణ తాగునీటి విభాగంమిషన్ భగీరథ నీరు అన్ని ఖనిజ లవణాలు కల్గిన సజల జలం. ట్యాంకుల శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ వర్షాకాలంలో ప్రతి రోజు ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను వేయాలని ఆదేశించాం. ట్యాంకుల పరిసరాల్లో ఎక్కడా నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాం.

# అయినోళ్లే... అపకారులు!



హైదరాబాద్ : తెలిసీ తెలియని వయసు.. ఆప్యాయంగా పలకరిస్తే పొంగిపోయే పసితనం.. ఈ పసిమొగ్గలు తెలిసినోళ్ల చేతిలోనే ఛిద్రమవుతున్నాయి.. వావి వరసలు మరచి మృగాలుగా ప్రవర్తిస్తున్నారు. ఎదురుతిరగలేని నిస్సహాయతను ఆసరా చేసుకొని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. బడికి తీసుకెళ్లే ఆటోడ్రైవర్ అనుచిత ప్రవర్తనతో ఒక బాలిక బయటి వ్యక్తులను చూస్తేనే భయపడే స్థితికి చేరింది. కన్నతండ్రి తప్పతాగి 14 ఏళ్ల కూతురిపై కన్నేశాడు. తాజాగా మలక్‌పేట్‌లో అంధబాలికపై అత్యాచార ఘటన కలకలం సృష్టించింది. ఇలా.. ఇంటా బయటా.. ఏదో మూలన బాలికలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నగర షీటీమ్స్, మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఊరూవాడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.కాటేస్తున్న కనురెప్పలు.. నగర పరిధిలో ఈ ఏడాది 6 నెలల్లోనే 409 పోక్సో కేసులు నమోదయ్యాయి. వీరిలో 90 శాతంమంది ఆ బాలికలకు పరిచయస్తులే. కొందరు రక్త సంబంధీకులున్నారు. పోలీసుల దర్యాప్తులో బాలికలపై లైంగిక దాడులకు పాల్పడినవారిలో స్థానికులు, మిత్రులు, బంధువులు, డ్రైవర్లు, దుకాణదారులు, వాచ్‌మెన్‌లే ఉంటున్నారు. కనురెప్పలే కాటేసిన రీతిలో కన్నబిడ్డలపై కన్నేసి అఘాయిత్యానికి పాల్పడిన నిందితుల జాబితాలో 13 మంది తండ్రులున్నారు. వివిధ కారణాలతో భర్త నుంచి దూరమైన మహిళల్లో కొందరు భద్రత కోసం బిడ్డలతో సహా నచ్చిన పురుషులతో సహజీవనం సాగిస్తున్నారు. మారుతండ్రిగా రక్షణగా నిలవాల్సిన వారు తల్లీబిడ్డల నిస్సహాయతను ఆసరా చేసుకొని చిట్టితల్లులతో లైంగిక అవసరాలు తీర్చుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు.

యుక్తవయసులో ఆకర్షణ వల

అరచేతిలో స్మార్ట్‌ఫోన్లు.. పాఠశాల వయసులోనే ప్రేమ పేరిట వల విసిరే అబ్బాయిల వలలో చిక్కుతున్నారు. పెళ్లయి పిల్లలున్న ప్రబుద్ధులు కూడా బాలికలను నమ్మించి ప్రేమ,పెళ్లి అంటూ దూరప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఈ ఏడు బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడినవారిలో 268 మంది బాయ్‌ఫ్రెండ్సే. ప్రతి 100 కేసుల్లో 50శాతం బాధితులు 15–18 సంవత్సరాల బాలికలే. తరువాత స్థానంలో 11–15, 10ఏళ్లలోపు చిన్నారులు వేధింపులు ఎదుర్కొంటున్నారు.

బడులు.. వాడల్లో కార్యక్రమాలు

తాజాగా నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో షీటీమ్స్, మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 300 మంది ఉపాధ్యాయులు, కళాశాలల్లోని 300మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు లైంగికవేధింపులు, దాడులకు పాల్పడేవారి ప్రవర్తన. బయటపడేందుకు అనుసరించాల్సిన పద్ధతులను విద్యార్థినులకు వివరిస్తారు. బ్యాడ్, గుడ్‌టచ్‌పై అవగాహన కల్పిస్తారు. లైంగిక వేధింపులకు గురైన చిన్నారులను గుర్తించడం, పోలీసులకు ఫిర్యాదు చేసి పసిమనసులు.. ఆ భయం నుంచి బయటపడేందుకు తోడ్పాటు అందిస్తారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు వీధివీధినా, కాలనీల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తారు.

ధైర్యంగా పంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వండి– కవిత దార, డీసీపీ, నగర మహిళా భద్రతా విభాగం

దగ్గరి బంధువులు, పరిచయస్తులే బాలికలు ఒంటరిగా ఉన్న సమయంలో వేధింపులకు దిగుతున్నారు. తల్లిదండ్రులకు చెబితే తమనే తిడతారనే భయం, చదువు మధ్యలో ఆపేస్తారనే ఆందోళనతో మౌనంగా భరిస్తున్నారు. ఇంటా, బయటా ఎదురయ్యే ఎలాంటి సమస్యలైనా ధైర్యంగా పంచుకునేలా పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి. ఏం జరిగినా మేమున్నామనే భరోసానిచ్చినప్పుడు కన్నబిడ్డలు తమ ఆవేదన పంచుకుంటారని గుర్తించాలి.నగరవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

# సిటీ పవర్.. నిధులే సవాల్



హైదరాబాద్ : మహానగరం అవుటర్ దాటి ప్రాంతీయ వలయ రహదారి వరకు విస్తరిస్తుండటంతో వచ్చే ఐదేళ్లలో విద్యుత్తు డిమాండ్ రెండింతలు అవుతుందని విద్యుత్తు పంపిణీ సంస్థ అంచనా వేస్తోంది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నెట్‌వర్క్ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పుడున్న ఉపకేంద్రాలు 9371 ఎంవీఏ సామర్థ్యం కల్గి ఉన్నాయి. అదనంగా మరో 3505 ఎంవీఏ సామర్థ్యాన్ని జత చేయాలనేది ప్రణాళిక. ఇందుకోసం రూ.2,650 కోట్ల అంచనాలతో నూతన ఉపకేంద్రాలు, కొత్త విద్యుత్తు లైన్లు, అధునాతన సాంకేతికత ఏర్పాటు వంటి ప్రతిపాదనలను డిస్కం సిద్ధం చేసింది.

ఓవర్‌లోడ్ సమస్య రాకుండా..

నగరం వేగంగా విస్తరిస్తుండడంతో వేసవిలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతోంది. ఈ ఎండాకాలంలో 4352 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. వచ్చే వేసవిలో 5వేల మెగావాట్లను తాకుతుందని అంచనా వేస్తున్నారు. కానీ రాబోయే ఐదేళ్లలో అనూహ్యంగా డిమాండ్ పెరగనున్నట్లు డిస్కం అంచనా వేస్తోంది. ప్రభుత్వం సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుండటం, బడ్జెట్‌లో వేర్వేరు ప్రాజెక్ట్‌లకు రూ.10వేల కోట్ల నిధులు ఇస్తామని చెప్పడం, అవుటర్ వరకు నగరం విస్తరణ, శివారులో పరిశ్రమలకు ప్రోత్సాహం, డాటాకేంద్రాలు నిర్మాణం పూర్తి చేసుకుని తమ కార్యకలాపాలను ప్రారంభించనుండటం, అన్ని ప్రాంతాల్లో ఆకాశహర్మ్యాలు వస్తుండటంతో డిమాండ్ భారీగా ఉండనుందని అంచనా వేస్తున్నారు. ఓవర్‌లోడ్ సమస్య రాకుండా కొత్తగా 169వరకు 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలు, 11కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రాధాన్యాన్ని బట్టి నిర్మించనున్నారు.

నిధులెలా? : విస్తరణ అవసరమయ్యే భారీ నిధులను సమకూర్చుకోవడం ఎలా అనేదే డిస్కం ముందున్న సవాల్. గతంలో కేంద్రం ప్రభుత్వంలోని పలు పథకాల్లో చేరి గ్రాంట్లను పొందేది. ఇప్పుడు కూడా అలాంటి పథకాల కోసం చూస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు.

# నిధులు నిలిచి.. నిర్వహణ కొరవడి!

కరీంనగర్: బడుల బలోపేతంపై దృష్టి నిలుపుతున్న ప్రభుత్వం వాటి నిర్వహణకు నయా పైసా సకాలంలో మంజూరు చేయడంలేదు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలైనా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత వెంటాడుతోంది. ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

**మంజూరైతే సాఫీగా...**

పాఠశాలలకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం నిర్వహణ నిధులను మంజూరు చేస్తే అవి సాఫీగా కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2465 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1.60 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఏటా మండల విద్యా వనరుల కేంద్రానికి రూ.90 వేలు, పాఠశాలల కాంప్లెక్స్‌కు రూ.33 వేలు, పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.80 వేల వరకు కేటాయిస్తున్నారు. ఆ నిధులను పాఠశాలల్లో చిన్నచిన్న మరమ్మతులకు, స్టేషనరీ, బిల్లులు వంటి వాటికి చెల్లిస్తారు.

చేయాల్సిన పనులు ఎన్నో..

విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠశాలల నిర్వహణకు నిధులు ప్రభుత్వం మంజూరు చేయని కారణంగా ప్రధానోపాధ్యాయులపైనే భారం పడుతోంది. బడిబాట ఫ్లెక్సీలు, కరపత్రాలు, పాఠశాలల ప్రారంభం రోజున సుద్దముక్కలు, హాజరు రిజిస్టర్లు, ఇతర సామగ్రిని వారే సొంత డబ్బులతో కొనుగోలు చేశారు. పర్వదినాల రోజున వివిధ కార్యక్రమాల నిర్వహణ, బాలలకు మిఠాయిలు, బహుమతుల పంపిణీకీ ఇదే పరిస్థితి. మండల కేంద్రాల నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులను పలు దఫాల్లో బడులకు తీసుకెళ్లేందుకు



రవాణా ఖర్చులను సొంతంగానే భరించారు. విద్యాశాఖ ఆదేశాలతో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలకూ ఖర్చులు తప్పడం లేదు. నిధుల లేమితో ఇక పాఠశాలలకు, తరగతి గదులకు అవసరమైన మైనర్ మరమ్మతుల జోలికి ఎవరూ వెళ్లడం లేదు. అంతర్జాలం, విద్యుత్తు బిల్లుల బకాయిలు చెల్లించడంలేదు. ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ పాఠశాలల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లే ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. పాఠశాలల నిర్వహణకు నిధులు లేని కారణంగా ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలని కొందరు ఆలోచిస్తున్నారు. ఈ విషయంపై కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావును వివరణ కోరగా.. ప్రభుత్వం త్వరలోనే నిధులు మంజూరు చేస్తుందన్నారు.

**క్రీడలపై ఆది నుంచి నిర్లక్ష్యమే...** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పీఈటీలకు ఇటీవల పీడీలుగా పదోన్నతులను విద్యాశాఖ కల్పించింది. పాఠశాలల్లో వీరు అందించే క్రీడా కార్యక్రమాలకు పరికరాల కొరత, అసౌకర్యంగా మారిన మైదానా లు అడ్డంకిగా మారాయి. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు అందించని కారణంగా వారి సేవలు ప్రార్థన, విద్యార్థులను క్రమశిక్షణతో నిలిపే వరకే పరిమితమవుతున్నాయి. విద్యార్థులు బడుల్లో యాంత్రిక జీవనానికి అలవాటు పడి క్రీడలకు దూరంగా నిలుస్తున్న దుస్థితి నెలకొంది.

# అదనపు బాధ్యతలతో పర్యవేక్షణ మృగ్యం

పెద్దపల్లి : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రగతిని సమీక్షించే మండల విద్యాశాఖ అధికారులుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వారే ఉండటంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మొత్తం 14 మండలాలకు అయిదుగురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా మూడు, నాలుగేసి మండలాల బాధ్యతలు చూస్తున్నారు. ఓవైపు ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాల, ఎంఈవోగా మండల విద్యాశాఖ బాధ్యతలతో తలకు మించిన భారంగా మారింది. అందరూ ఇన్‌ఛార్జి అధికారులే కావడంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. ఒకరికి మూడు కంటే ఎక్కువ మండలాలు
జిల్లావ్యాప్తంగా అయిదుగురు ఇన్‌ఛార్జి ఎంఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో సురేందర్‌కుమార్ పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి మండలాలు, లక్ష్మి మంథని, ముత్తారం మండలాలు, కవిత జూలపల్లి, ఎలిగేడు మండలాలు, ఛాయాదేవి ధర్మారం మండలం, రాజయ్య రామగుండం, పాలకుర్తి, అంతర్గాం, ఓదెల మండలాలకు విద్యాశాఖ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ధర్మారం ఎంఈవో మినహా మిగిలిన అధికారులకు మూడు కంటే ఎక్కువ మండలాల బాధ్యతలు చూస్తున్నారు. మండలానికి ఒక ఎంఈవో నియామకంపై విద్యాశాఖ చర్యలు తీసుకోవడం లేదు.

**ఇవీ సమస్యలు**

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అధిక ఫీజులు వసూలు, బడిలోనే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు విక్రయిస్తుండగా నియంత్రణ కరవైంది.
ప్రభుత్వ పాఠశాలల్లో చాలా చోట్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. బయోమెట్రిక్ లేకపోవడంతో ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలున్నాయి.
న్‌ఛార్జి ఎంఈవోలు పాఠశాల సముదాయ సమావేశాలు, మండల, జిల్లా సమీక్ష సమావేశాలకు వెళ్లాల్సి ఉండటంతో తనిఖీలు నామమాత్రంగా మారాయి.విద్యాసంవత్సరం ప్రారంభమై ఒకటిన్నర నెలలు దాటినా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ లేక నాణ్యత లోపిస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రగతి ఆందోళన కలిగిస్తోంది.తొలిమెట్టు, ఉన్నతి వంటి కార్యక్రమాల అమలుపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థుల్లో నానాటికీ సామర్థ్యాలు పడిపోతున్నాయి. అక్షర ప్రగతి లేని చోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలోని 14 మండలాల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాలలపై పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఎంఈవోలు తమ పరిధిలోని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం. –మాధవి, జిల్లా విద్యాధికారి



# 24 గంటల్లో పాస్‌పోర్టులు అప్పగించండి

## జోగి రమేశ్, దేవినేని అవినాశ్‌కు సుప్రీం ఆదేశం

దిల్లీ: వైకాపా నేతలు జోగి రమేశ్, దేవినేని అవినాశ్ తమ పాస్‌పోర్టులను 24 గంటల్లోపు దర్యాప్తు అధికారులకు అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో వారిద్దరూ నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ చేపట్టింది. 3 వారాలపాటు వారిపై తదుపరి చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

నిందితులు పూర్తిస్థాయిలో విచారణకు సహకరించాలని.. దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలతో ఇవాళ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేకపోతున్నామని జస్టిస్ సుధాన్షు దులియా, జస్టిస్ అమానుల్లా ధర్మాసనం తెలిపింది.

# మరో సారి స్పందించిన బుద్దా వెంకన్న

విజయవాడ, సెప్టెంబర్ 13: ఎడ తెరపి లేకుండా భారీ వర్షాల కారణంగా విజయవాడ నగరానికి వరద నీరు పొటెత్తడంతో వేలాది మంది సర్వం కోల్పోయారని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. రోజు కూలి పనులు చేసుకునే వారు సైతం ఆ జాబితాలో ఉన్నారన్నారు. నగర ప్రజల కష్టాలు, బాధలు తనను తీవ్ర ఆవేదనకు గురి చేశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తన వంతు బాధ్యతగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 5 లక్షల విరాళంగా అందజేశానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా.. పోరాటాలు చేసిన కార్యకర్తలు సైతం ఈ వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయారని సోదాహరణగా వివరించారు. దాంతో టీడీపీ కోసం పని చేసిన కార్యకర్తలను ఆదుకునేందుకు తాను మళ్లీ ముందుకు వచ్చినట్లు చెప్పారు. వారి నివాసాల్లోని టీవీలు, ఫ్రీజ్‌లతోపాటు ఇతర గృహోపకరణాలు సైతం పాడైపోయాయని తెలిపారు. వారందరికీ తమ కుటుంబ సభ్యుల ద్వారా ఆ యా వస్తువులు ఇచ్చేందుకు ఏర్పాట్లు సైతం చేసినట్లు ప్రకటించారు. అయితే తాను ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తో బాధ పడుతున్నానన్నారు. ఆ కారణంగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో తాను ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. దీంతో తాను రాలేక పోయినా.. టీడీపీ కోసం పని చేసిన కార్యకర్తలకు తన వంతుగా ఈ సాయం అందిస్తున్నాట్లు టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న వివరించారు. ఇంక ఎవరైనా తనతో కలిసి నడిచి.. పార్టీ కోసం పని చేసి వరదల్లో నష్టపోయిన వారి వివరాలను తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వారందరికీ తన వంతుగా తప్పకుండా సాయం అందిస్తానని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరీ ముఖ్యంగా విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. దీంతో లక్షలాది ఇళ్లు నీట మునిగాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పదుల సంఖ్యలో మరణాలు సైతం సంభవించాయి.

ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిన విషయం విధితమే. అయితే ఇళ్లలోకి వరద నీరు పోటెత్తడంతో.. వేలాది నివాసాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు ఇతర గృహోపకరాణాలు పాడైపోయాయి. వాటిని సైతం మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రంగంలోకి దిగింది. అలాంటి వేళ.. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సైతం.. నేను సైతం అంటూ విజయవాడలోని వరదలపై మరోసారి స్పందించారు.

# జగన్‌కు భద్రత పిటిషన్‌పై విచారణ హైకోర్టులో వాయిదా



అమరావతి, సెప్టెంబర్ 13: తాను సీఎంగా ఉన్న నాటి భద్రత కల్పించాలని మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై ఈరోజు (శుక్రవారం) హైకోర్టులో విచారణ జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. అయితే ప్రభుత్వం వేసిన కౌంటర్‌పై రిప్లై వేసేందుకు తనకు సమయం కావాలని జగన్ తరఫు న్యాయవాది కోరారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 25కు వాయిదా వేసింది. కాగా... ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్లను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. గత విచారణలో జగన్ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ), ఎస్పీ, స్టేట్ లెవల్ సెక్యూరిటీ రివ్యూ కమిటీ సభ్యుడు ఐపీఎస్ అధికారి షెల్కే నచికేత్ విశ్వనాథ్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. "మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నాం. ఈ కేటగిరీ కింద మొత్తం 58 మంది భద్రతా సిబ్బంది రక్షణగా ఉంటారు. తాజా భద్రత ముప్పు విశ్లేషణ నివేదిక ఆధారంగా ఆయనకు జడ్ ప్లస్ కొనసాగించాలని సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సు చేసింది. పిటిషనర్ 2014-19 మధ్య ప్రతిపక్షనేతగా ఉండగా జడ్ కేటగిరీ భద్రత ఉండేది. 2019లో ముఖ్యమంత్రి అయ్యాక జడ్ ప్లస్ ఇచ్చారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన, ఆయన కుటుంబ సభ్యులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక సెక్యూరిటీ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తూ 2023లో చట్టం తీసుకొచ్చారు. దీని ఆధారంగా జగన్‌కు అదనపు సిబ్బందితో భద్రత కల్పించారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందింది. ఈ నేపథ్యంలో అదనపు భద్రతకు జగన్, ఆయన కుటుంబ సభ్యులు అనర్హులు. చట్ట నిబంధనలు అనుసరించి ముఖ్యమంత్రి హోదాలో తనకు అదనపు భద్రత కల్పించారని పిటిషనర్‌కు తెలిసినప్పటికీ, ఆ విషయాన్ని దాచిపెట్టి ప్రస్తుత పిటిషన్ వేశారు. ప్రస్తుతం జగన్ ఓ ఎమ్మెల్యే మాత్రమే. ఎమ్మెల్యే హోదాలో ఆయనకు 1o1సెక్యూరిటీకి మాత్రమే అర్హులు. ఆయనకు ముప్పు ఉందని భావించినప్పటికీ 2o2 సెక్యూరిటీ మాత్రమే పొందగలరు. అయినప్పటికీ ప్రభుత్వం జగన్‌కు బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తుంది అంటూ కౌంటర్ దాఖలు చేశారు.

## తెదేపా కార్యాలయంపై దాడి కేసు.. పోలీసు కస్టడీకి నందిగం సురేష్

**అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై 2021లో జరిగిన దాడి కేసులో వైకాపాకు చెందిన బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ మంగళగిరి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సురేష్‌ను ఈ నెల 15 నుంచి 17 వరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారించనున్నారు.**



# కూటమి ప్రభుత్వ సారధ్యంలో ఏపీ అభివృద్ధి ఖాయం



విజయవాడ, సెప్టెంబర్ 13: ఎన్డీఏ ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉపాధ్యాయులు, మేధావులు, విద్యావంతులతో దగ్గుబాటి పురంధేశ్వరి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఏపీకి అన్యాయం చేయాలనే ఆలోచన బీజేపీకి ఎప్పుడూ లేదని తెలిపారు. అమరావతి రాజధాని అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. 2500 కోట్లు నేరుగా నిధులు కూడా గతంలో మంజూరు చేసిందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి 20వేల కోట్లు డీపీఆర్ ఓకే చేశారని తెలిపారు. ఇంటర్నెల్స్ రోడ్ల విస్తరణకు గడ్కరీ ఆమోదం తెలిపారన్నారు. అమరావతి ఏపీ రాజధాని కాబట్టే కేంద్రం కూడా ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. రైల్వే జోన్ విషయంలో గత ప్రభుత్వం అనుకూలమైన ప్రదేశం ఇవ్వలేదని.. ఆ స్థలం మార్చాలని కోరినా గత ప్రభుత్వం స్పందించలేదన్నారు. చంద్రబాబుకు లేఖ రాశారని.. ఆమోదం రాగానే రైల్వే జోన్ పనులు జరుగుతాయన్నారు. పోలవరం విషయంలో తెలిసీ తెలియని పరిస్థితులు కొన్ని ఉత్పన్నం అయ్యాయన్నారు. నిర్మాణం అయిన డయా ఫ్రం వాల్ దెబ్బ తినడం బాధాకరమన్నారు. నీటి నిల్వకు ఆ ప్రాజెక్టు నిలిచే పరిస్థితి లేదని.. ఇప్పుడు డయా ఫ్రం వాల్ నిర్మాణానికి 990కోట్లు కేంద్రం ఇస్తుందన్నారు. ఏపీ అభివృద్ధి కోసం బీజేపీ వేల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం సారధ్యంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం ఖాయమని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమే బీజేపీ విధానమన్నారు. ప్రధాని మోడీ సారధ్యంలో దేశ ప్రజల సంతోషంగా ఉన్నారన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ బోర్డుకు మార్పులు చేర్పులు వంటి అంశాలను ధైర్యంగా మోడీ అమలు చేశారని పురందేశ్వరి పేర్కొన్నారు.



# భూమిలో భయానక శబ్దాలు.. వీడిన మిస్టరీ

సరిగ్గా ఏడాది క్రితం.. అంటే 2023 సెప్టెంబరులో భూకంప పరిస్థితులను అధ్యయనం చేసే శాస్త్రవేత్తలకు ఓ మిస్టరీ సిగ్నల్ వినిపించింది. ఆర్కిటిక్ నుంచి అంటార్కిటికా వరకు ప్రపంచమంతా అది రికార్డ్ అయ్యింది. గతంలోనూ ఇంతకు ముందెన్నడూ ఇలాంటి శబ్దాలు వినకపోవడంతో శాస్త్రవేత్తలు తొలుత గందరగోళానికి గురయ్యారు. ఆ తర్వాత దీనిపై అధ్యయనం చేపట్టగా.. ఎట్టకేలకు ఆ మిస్టరీ వీడింది. అందుక్కారణం గ్రీన్‌లాండ్‌లో భారీ మంచు చరియలు విరిగిపడటమేనని తేలింది..! గతేడాది సెప్టెంబరులో వరుసగా 9 రోజుల పాటు ఈ వింత శబ్దాలు వినిపించాయి. సాధారణ భూకంప శబ్దాల కంటే భిన్నంగా నిరంతరం వైబ్రేషన్ ఫ్రీక్వెన్సీతో అది వినబడటంతో శాస్త్రవేత్తలు గందరగోళానికి గురయ్యారు. భూమి లోపల గుర్తుతెలియని వస్తువేదైనా ప్రయాణిస్తోందా? అని అనుమానించారు. దీంతో ఈ శబ్దాలపై లోతుగా పరిశోధనలు చేపట్టారు. చివరకు అవి మంచు చరియల కారణంగా ఏర్పడి సునామీ అలల శబ్దాలని తేలింది. ఈ మేరకు శాస్త్రవేత్తలు తమ అధ్యయనాన్ని ఓ జర్నల్‌లో పంచుకున్నారు. తూర్పు గ్రీన్‌లాండ్‌లోని డిక్సన్ ఫోర్డ్ ప్రాంతంలో గల ఓ పర్వతం వద్ద గతేడాది మంచు చరియలు విరిగిపడ్డాయి. దాదాపు 10వేల ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్స్‌ను నింపేంత మంచు, బండరాళ్లు విరిగిపడ్డాయి. దీంతో మెగా సునామీ సంభవించింది. చాలా ఎత్తు నుంచి మంచు చరియలు పడటంతో భూమి ఒక్కసారిగా కంపించింది. సునామీ కారణంగా 200 మీటర్ల ఎత్తు వరకు రాకాసి అలలు ఎగిసిపడ్డాయి. ఈ భారీ అలల ప్రభావం 9 రోజుల వరకు కొనసాగిందని అధ్యయనకారులు వెల్లడించారు. దీని కారణంగానే ప్రతి 90 సెకన్లకోసారి ఆ శబ్దాలు వినిపించినట్లు తెలిపారు. దీనికి గ్లోబల్ వార్మింగే కారణమని తెలుస్తోంది. డిక్సన్ ఫోర్డ్ ప్రాంతంలో 4వేల అడుగుల ఎత్తులో ఉండే మంచు పర్వతాల బేస్ వద్ద ఉన్న హిమానీనదం గత కొంతకాలంగా కరుగుతూ వస్తోంది. దీంతో గ్లేషియర్ కొన్ని పదుల మీటర్ల మందాన్ని కోల్పోయి పల్చగా మారింది. ఫలితంగా ఆ పర్వతాలు పట్టును కోల్పోవడంతో ఈ మంచు చరియలు విరిగినట్లు పడినట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.



# చిత్తూరు జిల్లాలో ఘోర ప్రమాదం

## చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. 8మంది మృతి

బంగారుపాళ్యం: చిత్తూరు జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బంగారుపాళ్యం మండలం మొగలి కనుమరహదారిలో బస్సు, రెండు లారీలు ఢీ కొన్న ఘటనలో ఎనిమిది మంది ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు వైపు నుంచి పలమనేరు వెళుతున్న ఆర్టీసీ బస్సును పలమనేరు వైపు నుంచి ఐరన్ లోడుతో వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ఈ దుర్ఘటన చేసుకుంది. కనుమ రహదారిలో మితిమీరిన వేగంతో వస్తున్న లారీ అదుపు తప్పి పక్క రోడ్డులో ఎదురుగా వస్తున్న బస్సు పైకి దూసుకెళ్లింది. ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ తో పాటు ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. మరో 30 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను పలమనేరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: సీఎం చంద్రబాబు...**
మొగలి కనుమదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆరా తీసిన సీఎం.. సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న వైద్య సాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.



# నిందితుడికి నార్కో పరీక్ష..?

కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో దర్యాప్తు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి నార్కో అనాలసిస్ పరీక్ష నిర్వహించాలని సీబీఐ భావిస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెల్డా కోర్టులో ఇప్పటికే సీబీఐ అభ్యర్థన దాఖలు చేసినట్లు సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు.

ఈ కేసులో నిందితుడికి ఇప్పటికే పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. అందుకు సంబంధించిన లై-డిటెక్టర్ పరీక్ష వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, అందులో సంజయ్ తాను ఏ తప్పు చేయలేదని చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి. తాను వెళ్లేసరికే ఆ వైద్యురాలు చనిపోయి ఉందని, తాను భయంతో పారిపోయానని అతడు చెప్పినట్లు తెలుస్తోంది.
దీంతో నిజనిర్ధారణ కోసం అతడికి నార్కో పరీక్షలు నిర్వహించాలని సీబీఐ భావిస్తున్నట్లు సదరు అధికారి పేర్కొన్నారు. సంజయ్ రాయ్‌తో పాటు ఈ కేసులో అరెస్టయిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్, బాధితురాలిపై హత్యాచార ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న మరో నలుగురు వైద్యులు, మరో సివిల్ వాలంటీర్‌కు ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు.
**ఏంటీ నార్కో పరీక్ష..** నార్కో అనాలసిస్ అనేది గ్రీకు పదమైన నార్కో (అనెస్థీషియా అని అర్థం) నుంచి వచ్చింది. ఈ పరీక్షలో భాగంగా వ్యక్తి శరీరంలోకి ఓ ఔషధాన్ని (సోడియం పెంటోథాల్, స్కోపలామైన్, సోడియం అమైథాల్) ఎక్కిస్తారు. దీన్నే ట్రూత్ సీరం అని కూడా అంటారు. ఆ వ్యక్తి వయసు, ఆరోగ్యం, భౌతిక స్థితి ఆధారంగా ఔషధ డోసును ఇస్తారు. ఇది ఇచ్చిన కొన్ని సెకన్లలోనే ఆ వ్యక్తి స్పృహ కోల్పోతాడు. ఈ సమయంలో వ్యక్తి నాడీ వ్యవస్థను పరమాణు స్థాయిలో ప్రభావితం చేస్తారు. ఆ సమయంలో దర్యాప్తు అధికారులు అడిగే ప్రశ్నలకు నిందితుడు తేలికగా సమాధానాలు వెల్లడిస్తాడు. స్పృహలో ఉన్నప్పుడు చెప్పని విషయాలనూ స్వేచ్ఛగా బహిరంగపరుస్తాడు. ఆ సమయంలో అతడి పల్స్, బీపీని నిపుణులు అనుక్షణం పర్యవేక్షిస్తారు. ఒకవేళ అవి పడిపోతున్నట్లు గ్రహిస్తే.. వెంటనే నిందితుడికి ఆక్సిజన్ అందిస్తారు. పాలిగ్రాఫ్, నార్కో అనాలసిస్ టెస్టులకు ఆ వ్యక్తి అంగీకారం తప్పనిసరి. ఈ పరీక్షలు నిర్వహించేందుకు మెజిస్ట్రేట్ అనుమతి అవసరం. అయితే, నార్కో అనాలసిస్‌లో వ్యక్తి ఇచ్చే స్టేట్‌మెంట్లను ప్రధాన సాక్ష్యాలుగా కోర్టులు పరిగణించవు. కానీ, కేసు దర్యాప్తునకు ఇవి కీలకంగా మారతాయి. గతంలో చాలా కీలకమైన కేసులను ఛేదించడంలో ఈ పద్ధతులను ఉపయోగించారు. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్ల కేసు, అబ్దుల్ కరీం తెల్గీ స్టాంపు పేపర్ల కుంభకోణం, 2006లో నోయిడా సీరియల్ మర్డర్స్, 26/11 ముంబయి ఉగ్రదాడి కేసులో కసబ్ విచారణ సమయంలో నార్కో పరీక్షలు నిర్వహించారు.

## కొల్లు రవీంద్ర పాస్‌పోర్టు ప్రక్రియ క్లియర్ చేయండి: హైకోర్టు ఆదేశం

అమరావతి: ఏపీ హైకోర్టులో మంత్రి కొల్లు రవీంద్రకు ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్టు ప్రక్రియ క్లియర్ చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసులకు సంబంధం లేకుండా పాస్‌పోర్టు ఇవ్వాలని స్పష్టం చేసింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంగా తన పాస్‌పోర్టును పునరుద్ధరించకపోవడం సరికాదని కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు అమెరికాలో జరగనున్న మైన్ ఎక్స్‌పో కార్యక్రమంలో తాను పాల్గొనాల్సి ఉందన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎంవీ రమణకుమారి వాదనలు వినిపించారు. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే



కారణంతో పాస్‌పోర్ట్‌ను తిరస్కరించొద్దని సుప్రీంకోర్టు, హైకోర్టులు పలు సందర్భాల్లో తీర్పులిచ్చాయని గుర్తుచేశారు.

# లేటు వయసులో లేడీ విలన్ గా...!

పాతిక సంవత్సరాల క్రితం మలయాళ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన అభిరామి తెలుగు లో పలు సినిమాల్లో నటించింది. టాలీవుడ్ లో ఈమె చేసిన సినిమాలు చాలా తక్కువ. అయినా తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. ఈమె తెలుగు లో చేసిన చెప్పవే చిరుగాలి సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, నటిగా ఆ సినిమా అభిరామికి విమర్శకుల ప్రశంసలు తెచ్చి పెట్టింది. అయినా టాలీవుడ్ లో ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశం ఈమెకు దక్కలేదు. టాలీవుడ్ లో ఆఫర్లు రాకున్నా తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో వరుసగా సినిమాలు చేయడం ద్వారా అభిరామి ఇన్నాళ్లు ఇండస్ట్రీలో కొనసాగుతూ వస్తోంది. నాలుగు పదుల వయసు దాటిన తర్వాత అభిరామి వరుసగా సినిమాలు చేస్తోంది. తెలుగు లో ఇటీవల రీ ఎంట్రీ ఇచ్చిన ఈమె నాని సినిమా సరిపోదా శనివారం లో కీలకమైన పాత్రలో కనిపించింది. సూపర్ హిట్ మహారాజా సినిమాలోనూ అభిరామి నటించింది. ఇక రాజ్ తరుణ్ తాజా చిత్రం 'భలే ఉన్నాదే' సినిమాలోనూ అభిరామి కీలక పాత్రలో కనిపించబోతుంది. ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు



రాబోతున్న భలే ఉన్నాదే సినిమా ప్రమోషన్ లో భాగంగా అభిరామి మీడియా ముందుకు వచ్చింది. ఒక వైపు తమిళ్ లో రెండు సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తున్న తాను మరో వైపు మంచి పాత్రలు వస్తే ఎలాంటి సినిమాల్లో అయినా నటించేందుకు సిద్ధం అంటూ ప్రకటించింది. అంతే కాకుండా లేడీ విలన్ గా నటించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. త్వరలోనే మీ ముందుకు ఒక సినిమా ద్వారా లేడీ విలన్ పాత్రతో వస్తానంటూ ప్రకటన చేసి అందరిని ఆశ్చర్య పరిచింది. లేటు వయసులో లేడీ విలన్ గా కనిపించడం అంటే కచ్చితంగా సాహసమే. కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ ప్రతిష్టాత్మక సినిమా థగ్ లైఫ్ లో అభిరామి కీలక పాత్రలో కనిపించబోతుంది. మలయాళం మరియు కన్నడ సినిమాల్లో అభిరామి కీలక పాత్రలో నటిస్తోంది. యంగ్ ఏజ్ లో కాస్త స్లోగా సినిమాలు చేసిన అభిరామి ఇప్పుడు మాత్రం వరుస సినిమాల్లో నటిస్తోంది. హీరోయిన్ గా నటిస్తూనే లేడీ విలన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ఇంకా గెస్ట్ రోల్స్ లో నటించడం వల్ల అభిరామి అన్ని భాషల్లో బిజీ బిజీ అయింది. ముందు ముందు మరిన్ని సినిమాల్లో అభిరామి నటించడం ఖాయం గా తెలుస్తోంది.

## నిమిషం ముందు రెజీనా అలా.. తర్వాత ఇలా..

రెజీనా కసాండ్రా.. తెలుగు సినీ ఇండస్ట్రీలో తక్కువ టైమ్ లో ఎక్కువ ఫేమస్ అయిన హీరోయిన్ అన్న విషయం తెలిసిందే. %హామీ%- శివ మనసులో శృతి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు.. డెబ్యూ మూవీతో అందరినీ ఆకట్టుకుంది. తన యాక్టింగ్ స్కిల్స్ తో ఫిదా చేసింది. దీంతో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. కానీ ఆమెకు సరైన బ్రేక్ రాలేదు. రవితేజ పవర్ మూవీతో స్టార్ హీరోయిన్ అవుతుందని అనుకున్నా.. అలా జరగలేదు. ఆ తర్వాత పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ సినిమాలు చేసినా ఆమెకు కలిసిరాలేదు. దీంతో రెజీనాకు తెలుగులో అవకాశాలు బాగా తగ్గిపోయాయి. కొన్నేళ్లుగా టాలీవుడ్ చిత్రాల్లో ఎక్కువగా కనిపించడం లేదు. చివరగా శాకినీ డాకినీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఆ సినిమాతో మెప్పించలేకపోయింది. ఇప్పుడు ఉత్సవం చిత్రంతో త్వరలోనే సందడి చేయనుంది. యంగ్ హీరో దిలీప్ ప్రకాష్ కు జోడీగా నటించింది. సెప్టెంబర్ 13వ తేదీన ఉత్సవం మూవీ రిలీజ్ కానుండగా.. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా



మీడియాతో ఇంటరాక్ట్ అయింది రెజీనా. ఆ సమయంలో సినిమా సినిమాకు ఎందుకు గ్యాప్ తీసుకుంటున్నారనే ప్రశ్న ఆమెకు ఎదురైంది. దీంతో తాను అసలు గ్యాప్ అనేది తీసుకోవడం లేదని తెలిపింది. తాను నటిస్తున్న చిత్రాల గురించి తెలుసుకుని ప్రశ్న అడగండని వ్యాఖ్యానించింది. దీంతో ఆమెకు కాస్త కోపం వచ్చినట్లు అర్థమైంది. అక్కడికి వెంటనే మళ్లీ వేరేలా మాట్లాడింది. సినిమాల మధ్య గ్యాప్ తీసుకుంటున్నానని, లేకుంటే మూవీలు చేయడం లేదని అనిపించి ఉంటే అది తన ప్లానింగ్ లోపం అని తెలిపింది రెజీనా. దానిని ఒప్పుకుంటానని చెప్పింది. ఇక అలాంటి ఫీలింగ్ రాకుండా సినిమాల్లో నటిస్తానని వెల్లడించింది. అలా ముందు చూపించిన చిన్న కోపాన్ని కవర్ చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. అయితే తెలుగులో రెజీనా సందడి తక్కువే ఉన్నా.. హిందీ, తమిళ భాషల్లో ఆఫర్లు అందుకుంటోంది. గోపీచంద్ మలినేని, సన్నీడియోల్ కాంబోలో రానున్న సినిమాలో నటిస్తోంది. బాలీవుడ్ లో రెండు చిత్రాల్లో యాక్ట్ చేస్తోంది. అందుకు సంబంధించిన అనౌన్స్మెంట్లు ఇంకా రాలేదు. తమిళంలో రీసెంట్ గా కంజురింగ్ కన్నప్పలో నటించింది. తెలుగులో మాత్రం చాలా రోజుల తర్వాత ఉత్సవం మూవీతో వస్తోంది. మరి ఎలాంటి హిట్ కొడుతుందో చూడాలి.




# జాన్వీకి డబ్బింగ్.. అనసూయ ఏమందంటే?



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్.. స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ దేవర మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. తెలుగులో తారక్ అంటే చాలా ఇష్టమని అనేకసార్లు చెప్పిన అమ్మడు.. ఇప్పుడు ఫేవరెట్ హీరో మూవీతోనే అడుగుపెడుతోంది. కొరటాల శివ తెరకెక్కిస్తున్న ఆ సినిమాలో తంగం పాత్రలో అచ్చ పల్లెటూరి అమ్మాయిలా కనిపించనుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ఆమె లుక్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

అయితే మేకర్స్ రీసెంట్ గా ట్రైలర్ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తెలుగు ట్రైలర్ వచ్చాక.. అంతా జాన్వీ కోసమే మాట్లాడుకుంటున్నారు. తెలుగు పూర్తిగా రాని ఆమె.. డైలాగ్స్ ఎలా చెప్పిందని అనుకున్నారు. కానీ జాన్వీకి తెలుగు స్టార్ యాంకర్, నటి అనసూయ డబ్బింగ్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన నెటిజన్లు.. సోషల్ మీడియాలో ఫుల్ పోస్టులు పెడుతున్నారు. నేచురల్ గా బాగా సింక్ అయిందని అంటున్నారు. దీనిపై అనసూయ లేదా మేకర్స్ ఇప్పటి వరకు అఫీషియల్ గా చెప్పకపోయినా.. మూవీ లవర్స్ మాత్రం ఆమెనే డబ్బింగ్ చెప్పిందని ఫిక్స్ అయ్యారు. అదే సమయంలో అనసూయ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది. "నొప్పించే లేదా పాజిటివ్ గా తీసుకున్న విషయాన్ని పక్కన పెట్టండి. నేను దానిని ఫన్నీగా భావిస్తున్నా. వారు ఆలోచించినదే.. అనుకున్నదే నిజమని అసలు కొందరు ఎలా భావిస్తారు" అని అడిగింది. "అసలు నిజంతో పని వద్దు వాళ్లకు.. మళ్లీ దానిపై చర్చలు, ఒపినీయన్లు, అసలు నిజమేంటో అక్కర్లేదు.. మన సినిమాలు ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవుతున్న తీరును అభినందిద్దాం.. క్రాఫ్ట్, ఆర్ట్, హార్డ్ వర్క్ ను అభినందిద్దాం.. నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ లెవల్ లో గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీ సాధించిన విజయాలను చూసి గర్విద్దాం" అని అనసూయ పోస్ట్ పెట్టింది. కానీ జాన్వీకి డబ్బింగ్ ఇచ్చిందో లేదో మాత్రం చెప్పలేదు.

అయితే గతంలో వేదం మూవీకి గాను హీరోయిన్ దీక్షా సేథ్ కు డబ్బింగ్ చెప్పింది అనసూయ. మళ్లీ ఇప్పుడు దేవర సినిమా కోసం తన టాలెంట్ చూపించిందని నెటిజన్లు చెబుతున్నారు. కానీ అనసూయ ట్వీట్ మాత్రం వేరేలా ఉంది. అనుకున్నదే నిజమని ఎలా అనుకుంటారని క్వశ్చన్ చేసింది. మొత్తానికి అమ్మడు.. జాన్వీ కపూర్ కు అసలు డబ్బింగ్ చెప్పిందో లేదో క్లారిటీ రావడం లేదు. ఆమె కూడా క్లియర్ గా పోస్ట్ లో చెప్పలేదు.

# దేవర.. పాదగట్టం సెగలు..



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ దేవర ట్రైలర్ రీసెంట్ గా రిలీజ్ అయ్యింది. ఈ ట్రైలర్ కి ఓ వర్గం ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. అదే సమయంలో బ్యాగ్రౌండ్ మ్యూజిక్, సీన్స్ ప్రెజెంటేషన్స్ పై సోషల్ మీడియాలో ట్రోల్స్ కూడా వస్తున్నాయి. ఎన్టీఆర్ దేవర సినిమాలో తండ్రి కొడుకులుగా రెండు వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్స్ లో కనిపిస్తున్నాడు. ఫ్యాన్స్ కి అయితే దేవర ట్రైలర్ బాగా కనెక్ట్ అయ్యింది. సినిమా మీద వారికి ఎక్స్ పెక్టేషన్స్ మరింత పెరిగాయి. ఇదిలా ఉంటే దేవర కంటే ముందుగా కొరటాల శివ మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ తో ఆచార్య మూవీ చేసి డిజాస్టర్ అందుకున్నారు. ఈ సినిమా కథాంశం ప్రేక్షకులకి అస్సలు కనెక్ట్ కాలేదు. మెగా అభిమానులు సైతం ఆచార్య సినిమా విషయంలో డిజప్పాయింట్ అయ్యారు. ముఖ్యంగా పాదఘట్టం అనే ప్లేస్ చుట్టూ ఆచార్య మూవీ కథ తిరుగుతూ ఉంటుంది. సినిమాలో ఆ పాదఘట్టం సౌండ్ మీద సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. దేవర ట్రైలర్ లోని కొన్ని ఎలిమెంట్స్ ని ఆచార్య పాదఘట్టంతో పోల్చి చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వర్గం వారు ట్రోల్ చేస్తున్నారు. కొంతమంది దేవర ట్రైలర్ లోని కొరటాల శివ చాలా డీటెయిలింగ్ గా కంటెంట్ ని చెప్పాడని ప్రశంసిస్తూ ఉంటే మరికొంత మంది పాదఘట్టం, సముద్రమట్టం అంటూ ట్రోలింగ్ చేస్తూ ట్వీట్స్ చేస్తున్నారు. ఆచార్యలో పాదఘట్టం ఉన్నట్లు దేవరలో కూడా ఒక ప్రాంతం ఉందని, అలాగే రామ్ చరణ్ పాత్రను దేవర పాత్రతో పోలుస్తూ సోనూసూద్ క్యారెక్టర్ సైఫ్ పాత్రకు దగ్గరగా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. ఒక్క ట్రైలర్ చూసి ఆ విధంగా ఆచార్య పోలికలు ఉన్నట్లు కామెంట్ చేయడం కరెక్ట్ కాదని మరికొందరు వాదిస్తున్నారు. అయితే కొంతమంది కావాలనే ఇలా సినిమాపై నెగిటివిటీ పెంచడానికి పనిగట్టుకొని విషప్రచారం చేస్తున్నారని ఎన్టీఆర్ ఫ్యాన్స్ అంటున్నారు. దేవర ట్రైలర్ తో మూవీకి కొంత హైప్ అయితే క్రియేట్ అయ్యింది. ఇప్పటికే ట్రైలర్ వ్యూవ్స్ పరంగా జెట్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ఇప్పటి వరకు దేవర మూవీ ట్రైలర్ అన్ని భాషలలో కలిపి 17 మిలియన్ వ్యూవ్స్ క్రాస్ చేసింది. ఇదే స్పీడ్ లో కొనసాగితే 24 గంటల్లో 20 మిలియన్ వ్యూవ్స్ ని ఈజీగా క్రాస్ చేస్తుందని అంచనా వేస్తున్నారు. ఎన్టీఆర్ 6 ఏళ్ళ తర్వాత సోలోగా ప్రేక్షకుల ముందుకొస్తున్న సినిమా కావడంతో దేవర కోసం ఫ్యాన్స్ ఆకలితో ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ లో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్స్ చూస్తుంటే కచ్చితంగా దేవరతో ఫ్యాన్స్ తో పాటు సినీ ప్రేమికుల ఆకలి కూడా తీరిపోతుందని సినీ విశ్లేషకులు అంటున్నారు. మరి సెప్టెంబర్ 27న రిలీజ్ కాబోయే ఈ మూవీ అంచనాల్ని ఏ మేరకు అందుకుంటుంది అనేది వేచి చూడాలి.

## ఆ అనుభవం నేను ఫేస్ చేశాను..బిగ్ బాస్ కిరక్ సీత వైరల్ స్టేట్మెంట్..

తెలుగింటి బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో ఇష్టమైన రియాలిటీ షో బిగ్ బాస్. బిగ్ బాస్ హడావిడి మొదలు కావడంతో ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ ఇంటి ముచ్చట్లే ప్రతి ఇంట్లో వినిపిస్తున్నాయి. ఇప్పుడు బిగ్ బాస్ తెలుగు సీజన్ 8 లో కొత్త కంటెస్టెంట్స్ సరికొత్త కథలతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తున్నారు. అలా ఇప్పుడు హౌస్ లోకి వచ్చిన లేడీ కంటెస్టెంట్స్ లో ఒకరు కిరాక్ సీత. యూట్యూబ్ వీడియోల ద్వారా పరిచయమై బేబీ సినిమా ద్వారా మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు బిగ్ బాస్ హౌస్లో తనదైన గేమ్ ఆడుతోంది. అనునిత్యం ట్విస్టులతో ప్రేక్షకులను బాగా ఎంటర్టైన్ చేస్తున్న ఈ మొత్తం 14 మంది కంటెస్టెంట్స్ హౌస్ లోకి ఎంటర్ అయ్యారు. ఇలా షో మొదలైందో లేదో అప్పుడే మొన్న ఆదివారం ఫస్ట్ ఎలిమినేషన్ కూడా



జరిగిపోయింది. బెజవాడ బేబక్క బయటకు వెళ్లిపోవడంతో ఇప్పుడు హౌస్ లో 13 మంది మిగిలారు.. ఇక ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ 13 మందికి సంబంధించిన ఎన్నో పాత విషయాల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కిర్రాక్ సీతకు సంబంధించి ఓ పాత వీడియో కూడా వెలుగులోకి వచ్చింది. బేబీ మూవీ అనంతరం బాగా పాపులర్ అయిన కిరాక్ సీత అప్పట్లో వరుస ఇంటర్వ్యూలో కూడా పాల్గొంది. ఈ నేపథ్యంలో తను ప్రొఫెషనల్ గా ఎన్ని సవాళ్లు ఎదుర్కొందో ఆమె ఒక సందర్భంలో వివరించింది. అంతేకాదు తన పర్సనల్ లైఫ్ కి సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలను కూడా ఆ వీడియోలో పంచుకుంది.. ఈతరం అమ్మాయిల్లో చాలామందికి ఉన్నట్టుగానే.. కిర్రాక్ సీత కూడా ఓ చిన్ని బ్రేకప్ స్టోరీ ఉందట. ఆ విషయాన్ని స్వయంగా వెల్లడించిన సీత.. తన జీవితంలో బ్రేకప్ స్టోరీ ఉండబట్టి బేబీ మూవీ తనకు బాగా కనెక్ట్ అయిందేమో అంటు చెప్పుకొచ్చింది. ఐదేళ్ల పాటు ఒక అబ్బాయిని ప్రేమించిన సీత పెళ్లి కూడా చేసుకోవాలని కలలు కనిందట. కానీ అబ్బాయి తల్లిదండ్రులు వీళ్లిద్దరి పెళ్ళికి ఒప్పుకోకపోవడంతో ఆ అబ్బాయి బ్రేకప్ చెప్పేసాడు. కేవలం పెద్దలను నొప్పించడం ఇష్టం లేక ఒకరి నుంచి ఒకరు దూరంగా ఉన్నారు తప్ప మోసం చేసుకోవడం లాంటివి ఏమీ లేవట.పాపం పర్సనల్ అయిపోయింది కష్టాలు పడినా సీత ప్రొఫెషనల్ గా కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో బాగా వినిపిస్తున్న క్యాస్టింగ్ కౌచ్ అనుభవాలు సీతకి కూడా ఎదురయ్యాయి.'ఒక సినిమాలో చేయడానికి ఆఫర్ ఉంది.. 25 లక్షల వరకు పారితోషకం ఇస్తారు కానీ ఈ మూవీలో మీకు ఛాన్స్ రావాలి అంటే ఫామ్ హౌస్ లో నిర్మాతను ఒకసారి కలవాలి.. అతనితో కలిసి ఫారిన్ టూర్ కి కూడా వెళ్లాలి' అని సీతను ఒకరు అప్రోచ్ అయ్యారట. అసలు విషయం అర్థమైంది సీత ఆఫర్ వద్దని చెప్పేసిందట. బిగ్ బాస్ లో ఇప్పుడు సీత యాక్టివ్ గా ఉండడంతో తిరిగి ఆమెకు సంబంధించిన ఈ విషయాలు అన్నీ వైరల్ అవుతున్నాయి.

## చీరలో భాగ్యశ్రీ అందం.. రెండు కళ్ళు సరిపోవేమో..

భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్ లో తన అందంతో, గ్లామర్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమా మిస్టర్ బచ్చన్ లోనే అదిరిపోయే నటనతో అందరి మనసులను గెలుచుకుంది. ఆ మూవీ ఫెయిల్యూర్ అయినప్పటికీ, ఆమె అందం, గ్లామర్, డ్యాన్సింగ్ టాలెంట్ వల్ల ప్రేక్షకులు ఆమెపై చూపు నిలిపారు. ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో గ్లామరస్ ఫోటోలతో అభిమానులు బాగా పెరుగుతున్నారు. ఇటీవల భాగ్యశ్రీ బోర్సే పంచుకున్న కొన్ని ఫోటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. వైట్ సారీలో అందంగా కనిపించిన ఈ ఫోటోలో ఆమె అద్భుతమైన ఫాషన్ సెన్స్ ను ప్రదర్శించింది. భాగ్యశ్రీ ప్రస్తుతం టాలీవుడ్ లో మరో ఛాన్స్ కొట్టేసింది. విజయ్ దేవరకొండ హీరోగా



నటిస్తున్న %ఎణ%12 సినిమాలో భాగ్యశ్రీ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోంది. విజయ్ దేవరకొండతో కలిసి నటించే ఈ అవకాశం ఆమె కెరీర్ కి మేజర్ టర్నింగ్ పాయింట్ అవుతుందని అనిపిస్తోంది. ఇదిలా ఉంటే, భాగ్యశ్రీ తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్ లో కూడా నటిస్తోంది. దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో కాంత అనే సినిమా తెరకెక్కుతోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా పీరియాడిక్ నేపథ్యంలో 1950 ల మద్రాస్ లో కథా నేపథ్యం తో ఉంటుంది. ఈ సినిమాలో భాగ్యశ్రీ కీలక పాత్ర పోషిస్తోంది. రానా దగ్గుబాటి కూడా ఈ సినిమాలో ఒక ప్రధాన పాత్రతో పాటు, నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ మల్టీ లింగ్వల్ గా తెరకెక్కబోతోంది. భాగ్యశ్రీ బోర్సే ఇన్‌స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటూ, తన గ్లామర్ పిక్స్ తో ఫాలోవర్స్ ని మరింతగా ఆకర్షిస్తోంది. ఇక కాంత సినిమా స్టార్ట్ అయిన సందర్భంగా ఆమె ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటోకి మంచి స్పందన వచ్చింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్స్ తో భాగ్యశ్రీ కెరీర్ మరింత ఊపందుకోవడం ఖాయం అంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు.



## ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్‌లో ట్రాఫిక్ స్ట్రీమ్‌లైన్ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్‌పై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ట్రాఫిక్ స్ట్రీమ్‌లైన్ చేయడంలో ట్రాన్స్‌జెండర్లను వాలంటీర్స్‌గా ఉపయోగించుకోవాలని సూచించారు. హోమ్‌గార్డ్స్ తరహాలో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించాలన్నారు. ఆసక్తి ఉన్నవారి వివరాలను సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




## ఆంధ్ర సెటిలర్లను కంటికి రెప్పలా చూసుకుంది కేసీఆరే.. వివాదంపై కౌశిక్ క్లారిటీ

హైదరాబాద్ : సెటిలర్లను తమ నుంచి దూరం చేసేందుకు కాంగ్రెస్ కుట్రపన్నుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 10 ఏళ్ల కాలంలో ఏనాడు సెటిలర్లకు ఇబ్బందులు కలగలేదని గుర్తు చేశారు. ఏపీ వాళ్లంటే బీఆర్ఎస్‌కు గౌరవమని.. సీఎం రేవంత్ రెడ్డి చేసే నీచ రాజకీయాల వల్ల ప్రస్తుతం వాళ్లు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. "ఆంధ్రా వాళ్లంటే మాకు గౌరవం ఉంది. నేను సెటిలర్స్ అనే పదం ఎక్కడా వాడలేదు. ఎక్కడైనా ఆంధ్రా అనే పదం వాడితే అది నాకు, గాంధీకి వ్యక్తిగతం మాత్రమే. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రా సెటిలర్స్‌ను కంటికి రెప్పలా చూసుకున్నారు. అందుకే జీహెచ్ఎంసీలోని అన్ని ప్రాంతాల్లో ఏపీ సెటిలర్లంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారు. ఓర్వలేని కాంగ్రెస్ నేతలు సెటిలర్స్‌ను మా నుంచి దూరం చేయాలని ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డి రోజురోజుకూ దిగజారుతున్నారు. కాంగ్రెస్ మంత్రులు కూడా నా స్థాయికి దిగజారిపోయారు. రేవంత్‌కు ఇక నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు అవసరం లేదు. రేవంత్ రెడ్డిని చూసి నేను భయపడట్లేదు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే వరకు పోరాటం ఆపేది లేదు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో ఇలాంటి పరిస్థితులు వచ్చాయా? కేసీఆర్, తెలంగాణ లేకపోతే రేవంత్ రెడ్డి సీఎం కుర్చీలో కూర్చునేవారా? రేవంత్ సర్కార్ రౌడీయిజాన్ని ప్రజలు కళ్లారా చూస్తున్నారు. గురువారం హరీశ్ రావును అరెస్టు చేసి షాద్‌నగర్ తీసుకువెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ప్రభుత్వం దౌర్జన్యం చేస్తోంది. పోలీసు రాజ్యంతో ప్రభుత్వాన్ని నడపలేరు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ నేతలు రోడ్ల మీద తిరిగలేరు. నాకు అండగా నిలిచిన మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు" అని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

**వణుకుతున్న ఎమ్మెల్యేలు..** హైకోర్టు తీర్పు తర్వాత బీఆర్ఎస్‌లోంచి కాంగ్రెస్‌లోకి జంప్ అయిన ఎమ్మెల్యేలు గజగజ వణుకుతున్నారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. వారందరిపై సస్పెన్షన్ వేటు పడటం ఖాయమని.. 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు కూడా పక్కా అని కౌశిక్ జోస్యం చెప్పారు. "కేసీఆర్ పెట్టిన భిక్షతో పార్టీ మారిన పది మంది.. ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వాళ్లకు ఇంగితం ఉంటే వెంటనే రాజీనామా చేయాలి. నేను అడిగిన ప్రశ్నలకు అరికెపూడి గాంధీకి ఎందుకు భయం. పీఏసీ చైర్మన్ గా బీఆర్ఎస్ హరీశ్ రావు పేరును ఇచ్చింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను కాపాడుకునేందుకు మేము ప్రతిదాడులు చేయడం లేదు. దానం నాగేందర్‌కు కూడా శృతి మించుతున్నారు. ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధం కావాలి" అని కౌశిక్ సవాల్ విసిరారు.

## తెలుగు రాష్ట్రాలకు రెండు కొత్త వందేభారత్ రైళ్లు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: తెలుగు ప్రజలకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు.

నాగ్‌పూర్ – హైదరాబాద్, దుర్గ్ – విశాఖపట్టణం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. దిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత కలిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

**వయో వృద్ధులకు మోదీ ఆపన్న హస్తం...** వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారని కేంద్రమంత్రి తెలిపారు. "70 ఏళ్లు దాటిన వారందరికీ రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు లబ్ధి చేకూరనుంది. వచ్చే రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి జరగనుంది. 70 ఏళ్లు దాటిన వయో వృద్ధులందరికీ.. ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ఆయుష్మాన్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5లక్షల టాప్–అప్ కవర్ ఇవ్వనుంది. కేంద్రం నిర్ణయంతో.. వయోవృద్ధుల్లో హర్షం నెలకొంది.

వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: హరీశ్‌రావు



హైదరాబాద్: రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి సహా పలువురు భారాస నేతల గృహనిర్బంధం నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు.. కౌశిక్‌రెడ్డి ఇంటిపై రాళ్లదాడి చేసిన వారికి రాచమర్యాదలు చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి వెళ్తే తమను అరెస్ట్ చేశారని మండిపడ్డారు.

కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగినప్పుడు డీజీపీ ఎందుకు స్పందించలేదని, భారాస నేతలపై దాడులు జరిగితే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. గురువారం జరిగిన ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమని అన్నారు. అరెకపూడి గాంధీని గురువారమే హౌస్ అరెస్ట్ చేసి ఉంటే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగేది కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో అరాచక పాలన గురించి రాహుల్‌గాంధీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును పక్కదారి పట్టించడానికే కౌశిక్‌రెడ్డిపై దాడికి దిగారని ఆరోపించారు. మాపై ఎన్ని రాళ్లు వేస్తారో వేయండి.. వాటితోనే మళ్లీ అధికారంలోకి వస్తాం అని హరీశ్‌రావు అన్నారు.

## గణేశ్ నిమజ్జనం.. 25 వేల మందితో బందోబస్తు: సీపీ



హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని మధ్యాహ్నం 1.30 గంటల్లోపు నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించామని.. దానికి వాళ్లు అంగీకరించారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని రకాల విగ్రహాలు కలిపి సుమారు లక్ష వరకు ఉండొచ్చన్నారు.

17న వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు హుస్సేన్‌సాగర్ పరిసరాలకు వస్తారని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు.




## 'అవన్నీ తప్పుడు ఆరోపణలు'.. తొలిసారి మౌనం వీడిన సెబీ చీఫ్

ముంబయి: తనపై వచ్చిన ఆరోపణలపై సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ తొలిసారి స్పందించారు. సెబీ చీఫ్‌గా ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారంటూ తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టారు. ఆ ఆరోపణలు తప్పని, దురుద్దేశాలతో కూడినవని పేర్కొన్నారు. సెబీ నిబంధనలు, మార్గదర్శకాలకు కట్టుబడి ఉన్నానంటూ పేర్కొన్నారు. ఈ మేరకు తన భర్తతో ధావల్ బచ్‌తో కలిసి ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. అదానీ గ్రూప్‌తో పాటు మరికొన్ని కార్పొరేట్ సంస్థల వ్యవహారంలో సెబీ చీఫ్‌పై ఇటీవల ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ కంపెనీలపై కావాలనే ఆమె నెమ్మదిగా దర్యాప్తు చేస్తున్నారని, ఇందుకు కారణం బచ్ గతంలో ఆ గ్రూప్‌లో పెట్టిన పెట్టుబడులు, ఒప్పందాలే కారణమని హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆపై కాంగ్రెస్ కూడా ఆమెపై విమర్శలు ఎక్కుపెట్టింది. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం అందుకుంటున్నారని, అలాగే, మాధవి దర్యాప్తు చేస్తున్న కంపెనీల నుంచి ఆమె భర్త ధావల్ బచ్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థ ఆదాయాలను ఆర్జిస్తోందన్నది ఆరోపణలు చేసింది. మహీంద్రా గ్రూప్ నుంచి ధావల్ బచ్ రూ.4.78 కోట్లు పొందారని కాంగ్రెస్ ఆరోపించగా.. సెబీ ఛైర్‌పర్సన్‌గా మాధవి నియామకానికి మూడేళ్ల ముందే ధావల్ తమ గ్రూప్‌లో చేరారని మహీంద్రా పేర్కొన్న సంగతి తెలిసిందే. డాక్టర్ రెడ్డీస్ కూడా తాము ధావల్ సేవలకు రూ.6.58 లక్షలు చెల్లించామని.. అది మాధవీ సెబీ ఛైర్‌పర్సన్ కాకమునుపేనని వివరించింది. తాము సెబీ నిబంధనలు/ఆదేశాల కిందకు ఎప్పుడూ రాలేదని పిడిలైట్ పేర్కొంది. అయితే, ఈ ఆరోపణలపై ఇంకా బచ్ స్పందించలేదంటూ హిండెన్‌బర్గ్ ఆరోపించిన వేళ.. ఈ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. అందులో తమపై వచ్చిన ఆరోపణలపై అంశాల వారీగా ఇరువురూ వివరణ ఇచ్చారు. తమ ఆదాయపు పన్ను రిటర్నుల ఆధారంగా తమపై ఈ ఆరోపణలు చేశారని, వాటిని అక్రమ మార్గంలో సంపాదించడం వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనతో పాటు, ఐటీ చట్టం ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు. ధావల్‌పై ఆరోపణలు: మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్, పిడిలైట్ వంటి కంపెనీల నుంచి ధావల్ బచ్ సేవలు వినియోగించుకున్నందుకు గానూ ఆయనకు చెందిన అగోరా ఇండియా, అగోరా పార్ట్‌నర్స్‌కు చెల్లింపులు చేశాయని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. తన జీవిత భాగస్వామి ఒక ప్రభుత్వంలో ఉన్నత అధికారిగా ఉన్నంత మాత్రాన ఆయన సలహాలను వినియోగించుకుంటే.. వారి వృత్తి నైపుణ్యాలను, సామర్థ్యాలను విస్మరించి తప్పులను ఆపాదించడం బాధాకరమని పేర్కొన్నారు. ధావల్ బచ్.. ఐఐటీ దిల్లీ నుంచి ఇంజినీర్ అని, 35 ఏళ్ల అనుభవం ఆయన సొంతమని గుర్తు చేశారు. హిందుస్థాన్ యూనిలీవర్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో పనిచేశారని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు.




## రష్యాపైకి 'తుపాన్' దూసుకురానుందా..? ఆందోళన రేకెత్తిస్తోన్న 'స్టార్మ్ షాడో' వార్తలు

రెండేళ్లు దాటినా ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ఒక ముగింపు రాకపోగా.. ఇంకా తీవ్రమవుతోంది. రష్యా క్షిపణి దాడులు చేస్తుండగా.. ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ తరుణంలో జెలెన్‌స్కీ ప్రభుత్వం తన పోరాట దిశను మార్చాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రష్యా భూభాగంలో మరింతగా చొచ్చుకెళ్లేలా దీర్ఘశ్రేణి క్రూజ్ క్షిపణులను వాడాలనుకుంటుందని వార్తలు వస్తున్నాయి. 'స్టార్మ్ షాడో' క్రూజ్ మిస్సైళ్లను ఉక్రెయిన్‌కు అందించేందుకు బ్రిటన్ ఆమోదం తెలిపినట్లు వస్తోన్న వార్తలే అందుకు కారణం. రష్యా భూభాగంలో పాశ్చాత్య దేశాలకు చెందిన అధునాతన ఆయుధాలు వాడటంపై పరిమితి ఉంది. కీవ్‌కు వీటిని వాడటానికి అనుమతిస్తే.. పాశ్చాత్యదేశాలు తమతో నేరుగా యుద్ధం చేసినట్టేనని ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరికలు చేశారు.

**అసలు ఏంటీ స్టార్మ్ షాడో..** స్టార్మ్ షాడో అనేది దీర్ఘశ్రేణి క్రూజ్ మిస్సైల్. స్టెల్త్ టెక్నాలజీతో రూపొందిన ఈ క్షిపణిని గాల్లో నుంచి ప్రయోగిస్తారు. దీనిని బ్రిటన్, ఫ్రాన్స్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. 155 మైళ్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంది. దీనిని యూఎస్ఎస్ఆర్ (యూఎస్ఎస్ఆర్‌లో రష్యా, ఉక్రెయిన్ భాగం)కు చెందిన ఎస్‌యూ–24 బాంబర్లతో సహా ఉక్రెయిన్ యుద్ధవిమానాల నుంచి ప్రయోగించే వీలు ఉంది. స్టార్మ్ షాడో అనేది బ్రిటిష్ పేరు. వీటిని ఫ్రాన్స్ 'ఎస్‌సీఏఎల్‌పీ–ఈజీ' అని పిలుస్తోంది. ఈ క్షిపణులను 1994లో అభివృద్ధి చేశారు. మాత్ర అండ్ బ్రిటిష్ ఏరోస్పేస్ దీనిని తయారుచేసింది. ఎంబీడీఏ సిస్టమ్స్ ప్రస్తుతం వీటిని రూపొందిస్తోంది. ఇదిలా ఉంటే.. వీటిని ఇతర దేశాలకు ఇవ్వడంపై కొన్ని పరిమితులు ఉన్నాయి. మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రెజిమ్ ప్రకారం అవి ఛేదించే రేంజ్, మోసుకెళ్లే పేలోడ్ సామర్థ్యం ఆధారంగా ఈ క్షిపణులను విదేశాలకు ఎగుమతి చేయడంపై ఆంక్షలు ఉన్నాయి. అంతేగాకుండా బ్రిటన్ ఈ ఎంటీసీఆర్ వ్యవస్థాపక సభ్యదేశం కావడం గమనార్హం. అయితే అదేమీ అధికారిక కట్టుబాటు కాదు. సభ్య దేశాల మధ్య ఒక అవగాహన కోసం పెట్టుకున్న నిబంధన అది. కాబట్టి ఆ నియంత్రణలను కచ్చితంగా పాటించాలని ఏమీ లేదు. ఇక, ఉక్రెయిన్ ఈ క్షిపణులను వాడితే, రష్యా స్పందన అంతే తీవ్రంగా ఉండొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అప్పుడు అణ్వాయుధాలను వినియోగించడం గురించి సీరియస్‌గా ఆలోచించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రష్యాపై పాశ్చాత్య అధికారులు రెచ్చగొట్టే ప్రకటనలు, బెదిరింపుల నేపథ్యంలో తమ ప్రాంతీయ సమగ్రతను కాపాడేందుకు అణ్వాయుధాలు వాడేందుకు వెనకాడబోమని గతంలో పుతిన్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

## నాతో మాట్లాడటానికి భారాసలో ఎవరూ లేరా?: అరెకపూడి గాంధీ



హైదరాబాద్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ విమర్శించారు. భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై గాంధీ మరోసారి స్పందించారు. భారాస కౌశిక్‌రెడ్డికి ఏమైనా పదవి ఇచ్చిందా? నాతో మాట్లాడటానికి భారాసలో ఎవరూ లేరా? అని ప్రశ్నించారు. "దేశ మహిళలను అవమానించేలా చీర, గాజుల గురించి మాట్లాడారు. నీ ఇంటికి వస్తా.. కండువా వేసి తీసుకెళ్తా అంటే అర్థమేంటి? ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తావా? కౌశిక్‌రెడ్డి రౌడీయిజం చేయడం దేనికి? తీరు మార్చుకోవాలి. అతను రెచ్చగొట్టినందుకే నేను అలా మాట్లాడాల్సి వచ్చింది. మాపైనే భారాస నేతలు దాడి చేశారు. మేము ఒక్కరిపై కూడా దాడి చేయలేదు. నీ ఇంటికి వస్తే ఏం చేశావు.. రాళ్లు రువ్వావు, పూల కుండీలు విసిరావు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు నా గురించి పూర్తిగా తెలుసు. అందుకే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. కేసీఆర్ అంటే ఎప్పటికీ నాకు గౌరవమే. కేసీఆర్ మమ్మల్ని ఆదరించారు, ఆశీర్వదించారు. కానీ, కౌశిక్‌రెడ్డి వంటి వాళ్లు ఉంటే పార్టీకి చెడ్డపేరు వస్తోంది. నోటికి అదుపులేని మనిషిని ఊరుమీదకు వదిలేశారు. అలాంటి వారి వల్లే అధికారాన్ని కోల్పోయాం. కౌశిక్‌రెడ్డి వల్ల కేసీఆర్ గొప్ప మనస్తత్వానికి, గతంలో చేసిన సేవలకు చెడ్డపేరు వస్తుంది" అని గాంధీ అన్నారు.

## హరీశ్‌రావు సహా భారాస ముఖ్య నేతల హౌస్ అరెస్టు

హైదరాబాద్: నగరంలో పలువురు భారాస నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ ఇంటికి ర్యాలీగా వెళ్లి సమావేశం నిర్వహిస్తామని భారాస నేతలు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కోకాపేటలోని నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావును గృహనిర్బంధం చేశారు. గురువారం సీపీ కార్యాలయం వద్ద జరిగిన తోపులాటలో తన భుజానికి గాయమైందని.. ఆస్పత్రికి వెళ్తానని ఆయన చెప్పగా పోలీసులు నిరాకరించారు. తామే ఆస్పత్రికి తీసుకెళ్తామంటూ అడ్డుకున్నారు. హరీశ్‌రావు నివాసం లోపలికి వెళ్లకుండా మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారిద్దరినీ అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

మరోవైపు శ్రీనగర్ కాలనీలోని ఇంట్లో సబితా ఇంద్రారెడ్డిని, వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గృహనిర్బంధం చేశారు. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానంద నివాసం, క్యాంపు ఆఫీసు వద్ద పోలీసులు మోహరించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి నుంచి భారాస నేతలు ర్యాలీగా బయల్దేరాలని నిర్ణయించారు. దీంతో ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి నివాసాల వద్ద కూడా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అరెకపూడి గాంధీ నివాసానికి బయల్దేరిన కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజును పోలీసులు అడ్డుకున్నారు.

తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఇంటికి వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని.. దానం నాగేందర్‌ను ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అక్కడికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com